సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in
# ముద్ర
హైదరాబాద్
ఆదివారం, 19.04.2026
www.mudranews.in | @mudranews
సంపుటి:13 సంచిక: 177
పేజీలు: 12 వెల: రూ. 5

## అప్పుడు చెల్లని రూపాయి
## ఇప్పుడెలా చెల్లుతుంది?

జగిత్యాల సభ బీఆర్ఎస్ బహిరంగ సభనా?

**జగిత్యాలలో మీడియా సమావేశంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..**

03

- మాజీ మంత్రి జీవన్ రెడ్డి చేరిక సభనా..?
- మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ ప్రకటించాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకోం..
- బీఆర్ఎస్ అక్రమ సంపాదనతో జన సమీకరణ..
- సభకు అనుమతివ్వాలని కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చాం..



## జగిత్యాల నుంచి జైత్రయాత్ర
### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సీఎంకు రెండున్నరేళ్లలో మేడిగడ్డకు పోవడానికి టైం లేదు

- తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ఎందుకు స్పందిస్తలేరు: హరీష్ రావు
- జగిత్యాల సభ ఏర్పాట్లు పరిశీలించిన కేటీఆర్, హరీష్ రావు

03



## ప్రజాస్వామ్య చరిత్రలో
## బ్లాక్ డే

**నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నిరసన ర్యాలీలో సీఎం చంద్రబాబు**



- మహిళా బిల్లును అడ్డుకోవటం దారుణం
- రిజర్వేషన్ బిల్లు అడ్డుకొని జాతికి ద్రోహం చేశారు
- మహిళల్ని ఓటు అడిగే పార్టీలు వారి సాధికారతను ఎలా అడ్డుకుంటాయి

09

## షిండే, నితీష్‌కు పట్టిన గతే
## చంద్రబాబుకు

**టీడీపీని తీసి పక్కన పడేస్తారు**

10

- బీజేపీతో పొత్తు చాలా ప్రమాదం
- చిట్ చాట్ లో సీఎం రేవంత్ వ్యాఖ్యలు



## కేంద్ర ఉద్యోగులకు డీఏ

- కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

10

# తెలంగాణలో జలకళ

## ఎనిమిది మీటర్లలోనే నీళ్లు!

- వివరాలు వెల్లడించిన భూగర్భ జలశాఖ
- గత ఏడాది ఆదుకున్న భారీ వర్షా లు
- 1771 పర్యవేక్షణ కేంద్రాల ఆధారంగా లెక్కలు
- హైదరాబాద్ సిటీ పరిధిలో 20 మీటర్ల లోతులోకి నీళ్లు

### గతేడాది కంటే గణనీయంగా పెరిగిన భూగర్భ జలమట్టం

**ముద్ర డెస్క్ :**

రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జలాలు గణనీయంగా పెరగడం నిజంగా ఊరట కలి గించే పరిణామం. గత ఏడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది నీటి మట్టం సుమారు 1.69 మీటర్ల మేర పైకి రావడం, 1,771 పర్యవేక్షణ కేంద్రాల ఆధారంగా వెల్లడైన డేటా స్పష్టంగా సూచిస్తోంది–ప్రకృతి అనుకూలిస్తే పరిస్థితులు ఎంత వేగంగా మారగలవో. గత రుతుపవన కాలంలో సాధారణం కంటే 37 శాతం అధికంగా కురిసిన వర్షపాతం భూగర్భ జలాశయాలను పునరుత్తేజపరిచింది. ఇది రైతుల కు, గ్రామీణ ప్రాంతాల జీవనాధారాల కు, తాగునీటి అవసరాలకు ఒక పెద్ద ఊరటనిచ్చే అంశం.

అయితే సానుకూల చిత్రంలోనే కొన్ని హెచ్చరికలూ దాగున్నాయి. ఖమ్మం వంటి జిల్లాల్లో 4–5 మీటర్లలోనే నీళ్లు అందుబాటులో ఉండటం ఆశాజనకమైనప్పటికీ, వికారాబాద్ వంటి ప్రాంతా ల్లో ఇంకా లోతుగా ఉండటం ప్రాంతాల మధ్య అసమానతలను చూపిస్తోంది. కొన్ని మండలాల్లో రెండు మీటర్లలోపే నీటి మట్టం ఉండటం ఒకవైపు సంతోషకరం కాగా, మరోవైపు ఈ వనరులను సమర్థంగా నిర్వహించకపోతే మళ్లీ కొరత పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉంది.

ప్రత్యేకంగా పట్టణ ప్రాంతాల పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాలు 20 మీటర్ల కు దిగజారడం, మేడ్చల్–మల్కాజ్‌గిరి ప్రాంతంలో మిగతా 02లో



## బీజేపీ అసలు కుట్ర
### ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి

- ప్రతిపక్షాలు ఓడించింది బీజేపీ దురుద్దేశాలనే
- మహిళా రిజర్వేషన్ల బిల్లు రేపే తెచ్చినా మద్దతు ఇస్తాం
- ప్రొరేటా పద్ధతి డీలిమిటేషన్‌తో రాష్ట్రాల మధ్య అంతరం
- బిల్లుల విషయంలో బీజేపీ, మోదీకి నిజాయితీ లేదు
- నియోజకవర్గాల పునర్విభజనపై అఖిలపక్ష సమావేశాలు, చర్చలు జరపాలి

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**


మూడొంతుల మెజారిటీ వస్తే రాజ్యాంగాన్ని మార్చివేయాలని... అన్ని వర్గాల రిజర్వేషన్లు రద్దు చేయాలని బీజేపీ భావిస్తోందని, అందుకే చార్ సౌ పార్ (400 సీట్లకు మించి) నినాదంతో 2024 ఎన్నికలకు వెళ్లారని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఆ ఎన్నికల్లో గెలిస్తే రాజ్యాంగ మార్పుతో పాటు, రిజర్వేషన్లు తొలగించాలని బీజేపీ భావించిందని, ప్రజలు జాగ్రుతమై 240 సీట్లకే బీజేపీని పరిమితం చేశారన్నారు. రాజ్యాంగ మార్పు, రిజర్వేషన్ల ఎత్తివేయాలంటే బీజేపీకి 2/3 వంతుల మెజారిటీ కావాలని, ఇప్పుడు మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన, నియోజకవర్గాల పెంపు బిల్లుల ముసుగులో రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ మరోసారి చేసిన ప్రయత్నాన్ని కాంగ్రెస్ పార్టీ, ఇతర విపక్షాలు కలిసి ఓడించాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బిల్లులు వీగిపోవడం కేవలం కేంద్రంలోని అధికార పార్టీ ఓటమే కాదు బీజేపి చిత్తశుద్ధి కూడా అని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి చిత్తశుద్ధి సరిగా లేనందునే రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయిందన్నారు. పార్లమెంట్‌లో ఓడిపోయింది మిగతా 02లో

## రేపటి నుంచి సంక్షేమ వారోత్సవాలు

10

### 20 నుంచి 26 వరకు సంక్షేమ వారోత్సవాలు
**రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి**

- జిల్లా కలెక్టర్లకు సీఎస్ కీలక ఆదేశాలు
- హాస్టళ్లు, గురుకులాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టి



- విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపు, ప్రజల్లో ప్రభుత్వ పథకాలపై అవగాహన
- ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో కార్యక్రమాల విస్తరణకు చర్యలు

## ఈ నెల 20 నుంచి రైతు భరోసా
### సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం




- 20 నుంచి రైతు భరోసా
- రెండో విడత నిధులు సిద్ధం
- రైతుల ఖాతాల్లోకి రూ.5653 కోట్లు
- భూపాలపల్లిలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- 45 లక్షల మందికి పెట్టుబడి సాయం

02




## ఇందిరమ్మ ఇండ్లుగా డబుల్ ఇళ్లు
### పట్టణ పేదలకు త్వరలోనే పంపిణీ

- నిర్మాణాలు పూర్తి చేసుకుంటే బిల్లులు
- సర్కారు కీలక నిర్ణయం.. పైలట్ ప్రాజెక్టుగా పాలమూరు..?
- కలెక్టర్లకు కీలక ఆదేశాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పట్టణ పేదలకు ఇండ్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దీని మహబూబ్ నగర్ జిల్లా నుంచి పైలట్ ప్రాజెక్టుగా మొదలుపెట్టాలని భావిస్తున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల రెండో దశలో అంటే సొంతింటి నిర్మాణం కోసం స్థలం లేని వారిని L2 జాబితాలో తీసుకుని.. వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు ఏ స్థితిలో ఉంటే అదే స్థితిలో అప్పగించాలని మిగతా 02లో

# నారీశక్తిని అడ్డుకున్నారు

### బిల్లును కాదు.. నారీశక్తినే ఓడించారు

- 40 ఏళ్ల పోరాటానికి అడ్డుకట్ట వేసిన రాజకీయ స్వార్థం
- మహిళా బిల్లును అడ్డుకోవడం భ్రూణహత్యతో సమానం
- డీలిమిటేషన్‌పై అసత్యాలు ప్రచారం చేస్తున్నారు
- సంస్కరణలకు కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకమే
- మహిళలు, యువత గట్టిగా జవాబిస్తారు
- మహిళా బిల్లు అడ్డుకున్న విపక్షాలపై మోదీ విమర్శలు



**ముద్ర డెస్క్ :**

దేశంలో మహిళా సాధికారతను అడ్డుకుంటున్న శక్తులపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందకపోవడం నేపథ్యంలో దేశ ప్రజలను ఉద్దేశించి శనివారం ప్రసంగించిన ఆయన, విపక్షాలపై కఠిన విమర్శలు గుప్పించారు. దేశ హితం కంటే స్వార్థ రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని మండిపడ్డారు.

మహిళల కలలను ధ్వంసం చేసిన బాధ్యత పూర్తిగా కాంగ్రెస్, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ వంటి పార్టీలదేనని మోదీ ఆరోపించారు. “ఇవి కుటుంబ పార్టీలే. మహిళలు ఎదగడం వీరికి ఇష్టం లేదు. వారు ఓడించింది బిల్లును కాదు.. భారత నారీశక్తినే” అని ఘాటుగా వ్యాఖ్యానించారు.

40 ఏళ్లుగా మహిళలు తమ హక్కుల కోసం పోరాడుతున్నారని గుర్తుచేసిన ప్రధాని, ఎంతో కృషితో, నిజాయతీతో తీసుకొచ్చిన బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. మహిళా బిల్లుకు క్రెడిట్ తీసుకోవాలని విపక్షాలకు విజ్ఞప్తి చేశామని, అయినా నిలువరించారన్నారు. మిగతా 02లో

ఇదీ AI
ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 19.04.2026
www.mudranews.in | @mudranews



## మద్యం బంద్: స్పష్టమైన నిర్ణయం తీసుకోండి



"నేను తగ్గిస్తా" కాకుండా "నేను మానేస్తా" అనే దృఢ నిర్ణయం తీసుకోండి, మీ లక్ష్యం ఏమిటో రోజూ గుర్తు చేసుకోండి

# బీజేపీ అసలు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)
బీజేపీ ప్రభుత్వ దురుద్దేశమేనన్నారు. ఈ బిల్లులు వీగిపోవడానికి కారణమైన నేతలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సీఎం తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో శనివారం మధ్యాహ్నం విలేకరులతో మాట్లాడారు.

**ఇది విపక్షాల విజయం**

ప్రస్తుతం లోక్ సభలో ఉన్న 543 సీట్లలో 1/3 వంతు సీట్లు, రాష్ట్రాల శాసనసభల్లో 1/3 వంతు సీట్లు మహిళలకు రిజర్వేషన్లు కల్పించేలా మహిళా రిజర్వేషన్లపై సోమవారం వరకు కొత్త చట్టాలను రూపొందించి పార్లమెంట్ ముందుకు తీసుకురావాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. అలా బిల్లు తెస్తే ఇండియా కూటమితో కలిపి 2023 మాదిరిగా ఆ బిల్లుకు తాము మద్దతు ఇస్తామని, సోమవారం బిల్ పాస్ చేసుకొని... మంగళవారం నుంచే ఈ చట్టాన్ని అమలు చేయవచ్చని సీఎం తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనకు అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేయాలని, నిపుణులతో చర్చించాలని, ప్రతి రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయాలు తెలుసుకోవాలని, ప్రతి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి జాతీయ ఏకాభిప్రాయ సాధనకు కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆయా రాష్ట్రాలతో సంప్రదించి శాసనసభల్లో స్థానాల సంఖ్య పెంచవచ్చని సీఎం అన్నారు. రాజ్యాంగాన్ని మార్చుతానంటే దేశ ప్రజలు ఒప్పుకోరని, దీంతో మహిళా రిజర్వేషన్లను అమలు చేయాలని మేం యోచిస్తే...దానిని కాంగ్రెస్ అడ్డుకుందని తమను బద్నాం చేసే పనిలో మోదీ, బీజేపీ పడ్డాయని సీఎం విమర్శించారు. అందులో భాగంగానే ఆందోళనలు చేపట్టారన్నారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్తశుద్ధి చాటుకోవాలని, సరైన పద్ధతిలో బిల్లులు తయారు చేయాలని సీఎం సూచించారు. పార్లమెంట్‌లో ఓడిపోయింది మోదీ అహంకారం తప్ప మరొకటి కాదన్నారు.

### అడ్డుగోడలు పెట్టవద్దు

కాంగ్రెస్ పార్టీకి దేశం మొదటి ప్రాధాన్యత అని, ఆ తర్వాత ప్రజలు, చివరగా పార్టీ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నరేంద్ర మోదీ, బీజేపీకి మాత్రం తొలుత పార్టీ, తర్వాత సొంత విషయాలు, ఆ తర్వాతే దేశమని సీఎం విమర్శించారు. ఉత్తర, దక్షిణాల మధ్య అంతరా లు సృష్టించి అడ్డుగోడలు పెట్టొదని మోదీ, బీజేపీకి సీఎం హితవు పలికారు. దేశంలో దక్షిణాది రాష్ట్రాలు భాగమేనని.. దేశంలోనే దక్షిణాది ప్రజలు బతుకుతున్నారని, దేశ సేవలో తాము ఎవరికన్నా తక్కువ కాదని, దేశాన్ని కాపాడుకోవడం తమ బాధ్యత అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

**మాకు చిత్తశుద్ధి ఉంది**

మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్, బీజేపీ చిత్తశుద్ధి ఏమిటో తేల్చుకుందామని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. 2011 జనాభా లెక్కలు, ఇతర డేటా ఎన్నికల కమిషన్ దగ్గర ఉన్నాయన్నారు. 2009లో డీలిమిటేషన్ జరిగిందని, ఆ లెక్కలతో ఆగస్టు 15, 2026 లోపు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించవచ్చని సీఎం అన్నారు. ఆ రిజర్వేషన్లతో ప్రధాన మంత్రి ప్రాతినిధ్యం వహిస్తోన్న ఉత్తరప్రదేశ్‌లో 2027లో జరిగే ఎన్నికల్లో అమలు చేయవచ్చన్నారు. ఆ విధంగా రిజర్వేషన్లు అమలు చేస్తే... తెలంగాణ సీఎంగా తాను బాధ్యత తీసుకొని దక్షిణాది రాష్ట్రాల సీఎంలు స్టాలిన్, పినరయి విజయన్, సిద్దరామయ్య, చంద్రబాబు నాయుడు, పుదుచ్చేరి సీఎం రంగసామిలతో చర్చలు జరుపుతానని సీఎం తెలిపారు. ఇండియా కూటమి నేతల మద్దతు కూడగతానని చెప్పారు. 2023 లో పాస్ అయిన బిల్లులో సవరణలు చేయాలనుకుంటే ఒక చిన్న మార్పుతో రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కానీ బీజేపీ ఉద్దేశం రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల ఎత్తివేయడమేనని, పార్లమెంట్ వేదికగా జరిగిన ఈ తీరును 140 కోట్ల మంది ప్రజలు చూశారన్నారు.

**సమగ్రతను బలహీనపరుస్తారా..?**

దేశ భవిష్యత్‌ను, సమగ్రతను బలహీనపర్చేలా దేశ రాజకీయ చిత్రపటాన్నే మార్చే బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం తీసుకువచ్చిందని.. దానిని ప్రతిపక్ష పార్టీలు ఓడించాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రతిపక్షాలు అడ్డుకున్నది ప్రమాదకరమైన నియోజకవర్గాల పునర్విభజననే తప్ప మరేం కాదన్నారు. ప్రతిపక్షాలు నిలువరించింది.. ఓడించింది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశాన్నేనని సీఎం స్పష్టం చేశారు. బిల్లుల విషయంలో బీజేపీ, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నిజాయితీ లేదని సీఎం విమర్శించారు. మహిళా బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేసిందన్నారు. తమకు గంట సమయం ఇస్తే బిల్లును మార్చివేస్తామని అమిత్ షా అన్నారని.. సోమవారం వరకు సమయం ఉందని, ప్రస్తుతం ఉన్న 543 సీట్లతోనే బీజేపీ మహిళా బిల్లు తీసుకువస్తే మంగళవారమే పాస్ చేస్తామని తెలిపారు.
బీజేపీ తెచ్చిన డీలిమిటేషన్ దక్షిణాది రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలను రాజకీయంగా దెబ్బతీసే డీలిమిటేషన్ అని, దేశాన్ని.. ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చే డీలిమిటేషన్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం విధానాల ఆధారంగా దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పాటించాయని ఫలితంగా ఆయా రాష్ట్రాల్లో జనాభా తగ్గిపోయిందన్నారు. దేశానికి విధేయంగా వ్యవహరించిన దక్షిణాది రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి జరిమానా విధిస్తామనడం ఏవిధంగా సరైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తల్లిని చంపి.. బిడ్డను రక్షించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర విభజనపై పలుమార్లు ద్వేషం చూపారని.. ఇప్పుడు ఆయన బాటలోనే ఎంపీ తేజస్వీ సూర్య పయనిస్తున్నారని సీఎం మండిపడ్డారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఆ పార్టీ ఎంపీ లక్ష్మణ్ మోదీ దృష్టిని ఆకర్షించి ప్రమోషన్లు పొందేందుకు ప్రయత్నిస్తున్నారనే తప్ప ప్రజల అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని సీఎం విమర్శించారు. తాను సూచించిన విధానం కిషన్ రెడ్డికి నచ్చకపోతే ప్రత్యామ్నాయం ఏమిటో చెప్పాలే తప్ప ఎదురుదాడి చేయడమేమిటని సీఎం ప్రశ్నించారు.

**కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారిత**


మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధిని ఏ ఒక్కరూ ప్రశ్నించలేరని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అగ్రరాజ్యం అమెరికాలో ఓటు హక్కు కోసం మహిళలు 150 సంవత్సరాలు పోరాడారని, కానీ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. దేశానికి మహిళా రాష్ట్రపతి, ప్రధానమంత్రులను కాంగ్రెస్ అందించిందని, లోక్‌సభ స్పీకర్‌గా, అనేక రాష్ట్రాల్లో గవర్నర్లు, ముఖ్యమంత్రులుగా మహిళలను కాంగ్రెస్ పార్టీ చేసిందని సీఎం తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి స్వాతంత్ర్యానికి పూర్వమే మహిళలు అధ్యక్షులుగా ఎన్నికయ్యారని.. స్వాతంత్ర్యనంతరం ఇందిరా గాంధీ, సోనియా గాంధీ అధ్యక్షులుగా సేవలందించారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. సోనియా గాంధీ సుదీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా పని చేశారని సీఎం తెలిపారు. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తీసుకువచ్చారని.. ఫలితమే ఇప్పుడు దేశంలో పలు ప్రాంతాల్లో స్థానిక సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం 50 శాతానికి చేరుకుందన్నారు. 1980లో ఏర్పడిన బీజేపీకి ఇప్పటి వరకు 15 మంది అధ్యక్షులైతే అందులో ఒక్కరూ కూడా మహిళ లేరని సీఎం తెలిపారు. అద్వాణీ, మురళీ మనోహర్ జోషి లాంటి వాళ్లు రెండు మూడు సార్లు అధ్యక్షులయ్యారని, కానీ ఒక్క మహిళకు అవకాశం ఇవ్వలేదన్నారు. అలాంటి బీజేపీ మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీనిఎలా విమర్శిస్తుందని సీఎం ప్రశ్నించారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, సురేష్ షెట్కార్, బలరాం నాయక్, విప్‌లు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, బుయ్యాని మనోహర్ రెడ్డి, తూడి మేఘా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 20 నుంచి
# రైతు భరోసా

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా రెండో విడత నిధుల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈనెల 20వ తేదీన (ఎల్లుండి) రెండో విడుత నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ పథకం కింద ప్రభుత్వం రాష్ట్రంలో 1.50 కోట్ల ఎకరాలకు సాయం అందిస్తోంది. ఎకరానికి రూ. 6 వేల చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తుంది. 20వ తేదీన భూపాలపల్లి జిల్లా కాటారంలో జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల సమక్షంలో ఈ నిధులు విడుదల చేస్తారు. తెలంగాణలో మొత్తం 73 లక్షల మంది రైతులున్నారు. వీరందరికీ గత నెల 23వ తేదీన మొదటి విడుత రైతు భరోసా సాయాన్ని ప్రభుత్వం పంపిణీ చేసింది. ప్రతి రైతుకు ఒక ఎకరానికి సరిపడే పెట్టుబడి సాయం ముందుగా విడుదల చేసింది. దాదాపు రూ.3,590 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసింది. 2వ విడతలో 45,11,947 మంది రైతులు రైతు భరోసా సాయం అందుకుంటారు. దీంతో రూ. 5653 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని వ్యవసాయ శాఖ వెల్లడించింది. రెండో విడత నిధుల పంపిణీ అనంతరం, మూడో విడత నిధులను వీలైనంత తొందర గా విడుదల చేసేందుకు ప్రభుత్వం ఏర్పా ట్లు చేసింది.

# తెలంగాణలో 'జల'కళ

(మొదటి పేజీ తరువాయి)
28 మీటర్ల లోతుకు పడిపోవడం ఇవి కేవలం గణాంకాలు కాదు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి సంక్షోభానికి సంకేతాలు. నిర్బంధం లేకుండా మోటార్లతో నీటిని తోడేయడం, కాంక్రీ ట్ అరణ్యాల పెరుగుదల, భూమిలో నీరు చొరబడే అవకాశాల తగ్గుదల ఇవ న్నీ కలి సి ఒక ప్రమాదకరమైన ధోరణిగా మారుతున్నాయి.
ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న ముందుకు వస్తుంది: వర్షాలు ఎక్కువగా కురిసినప్పుడే భూగర్భ జలాలు పెరుగుతాయా? లేక మనం దీర్ఘకాలిక నీటి నిర్వహణకు సిద్ధమా? కేవలం ప్రకృతిపై ఆధారపడే విధానం స్థిరమైనది కాదు. రేన్‌వాటర్ హార్వెస్టింగ్‌ను కచ్చితంగా అమలు చేయడం, చెరువులు–కుంటలను పునరుద్ధరించడం, పట్టణాల్లో పార్కింగ్ స్థలాలు, రోడ్ల నిర్మాణంలో నీరు నేలలోకి చొరబడే విధానాలను ప్రోత్సహించడం అత్యవసరం.
గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న అనుకూల పరిస్థితిని నిలబెట్టుకోవడం కూడా అంతే ముఖ్యమైనది. రైతులు నీటి వినియోగంలో సమర్థత పాటించడం, సూక్ష్మ పంట పద్ధతులను విస్తరించడం, భూగర్భ జలాలపై ఆధారాన్ని తగ్గించే విధానాలు అవలంబించాలి. ప్రభుత్వం కూడా డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకుని, నీటి వినియోగంపై కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేయాల్సిన అవసరం ఉంది.
మొత్తానికి, ఈ ఏడాది భూగర్భ జలాల పెరుగుదల ఒక సానుకూల సంకేతం. కానీ ఇది శాశ్వత పరిష్కారం కాదు.. ఒక అవకాశం మాత్రమే. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని స్థిరమైన నీటి నిర్వహణ విధానాలు అమలు చేస్తేనే భవిష్యత్తులో నీటి భద్రత సాధ్యమవుతుంది. లేకపోతే, ఈరోజు కనిపిస్తున్న "పుష్కల నీరు" రేపటి "తీవ్ర కొరత"గా మారడానికి ఎక్కువ సమయం పట్టదు.



## ఇందిరమ్మ ఇండ్లుగా
# డబుల్ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)
ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బేస్‌మెంట్, స్లాబ్, ఫినిషింగ్ దశలో వాటిని లబ్ధిదారులకు అప్పగిస్తారు. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను ఇక లబ్ధిదారులే స్వయంగా ఆ పని పూర్తి చేసుకోవాలి. దీనికి ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుంది. వీటికోసం లబ్ధిదారుల కమిటీ ఏర్పాటు చేస్తారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాల్లో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇందిరమ్మ ఇండ్ల కింద పంపిణీ చేస్తామని గృహ నిర్మాణ సంస్థ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

**అసంపూర్తి నిర్మాణాలు**

తెలంగాణలో గత ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన 8 వేలకు పైగా డబుల్ బెడ్రూం ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల పథకంలోని ఎల్–2 (స్థలాలు లేని వారు) లబ్ధిదారులకు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పాత కాంట్రాక్టు ఒప్పందాలను రద్దు చేసి లబ్ధిదారుల కమిటీల ద్వారా నిర్మాణాలను పూర్తి చేయించనున్నారు. ఏ దశలో ఉన్న ఇళ్లనైనా లబ్ధిదారులకు అప్పగించి మిగిలిన పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కలెక్టర్లకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణలోని పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు రేవంత్ సర్కార్ ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే తొలిదశ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ వేగం పుంజుకుంది. సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు (L–1) ఇప్పటికే మొదటి విడతలో నిధులు మంజూరు చేసి నిర్మాణాలు చేపడుతున్న ప్రభుత్వం.. ఇప్పుడు స్థలాలు లేని నిరుపేదలకు (L–2) సైతం శుభవార్త చెప్పింది. గత ప్రభుత్వం నిర్మించి అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని జిల్లాల కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ముందుగా ఒక జిల్లాను పైలట్ గా తీసుకోనున్నారు. ప్రస్తుతం అధికారులు చెబుతున్న ప్రకారం మహబూబ్ నగర్ ను పైలట్ గా తీసుకుంటున్నారు. ఇక్కడ 18,816 రెండు పడక గదుల ఇళ్లు మంజూరు కాగా ప్రస్తుతం 10,353 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిలో సుమారు 5 వేల ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక జరగకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. మరోవైపు 3550 ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో పూర్తయిన ఇళ్లతో పాటు అసంపూర్తిగా ఉన్న మొత్తం 8 వేలకు పైగా ఇళ్లను స్థలాలు లేని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం కేటాయించనుంది.

**ఎలా ఉంటే అలాగే**

డబుల్ బెడ్రూం ఇళ్లు ఏ స్థితిలో ఉన్నా అంటే బేస్‌మెంట్, స్లాబ్ లేదా ఫినిషింగ్ దశలో వాటిని లబ్ధిదారులకు అప్పగిస్తారు. ఒకవేళ నిర్మాణం అసంపూర్తిగా ఉంటే.. లబ్ధిదారులే స్వయంగా ఆ పనిని పూర్తి చేసుకునేలా ప్రభుత్వం బిల్లులు మంజూరు చేస్తుంది. దీనికోసం గతంలో గుత్తేదారులతో ఉన్న ఒప్పందాలను ప్రభుత్వం రద్దు చేసింది. జీ–ప్లస్ పద్ధతిలో ఉన్న సముదాయాలను లబ్ధిదారుల నేతృత్వంలోని కమిటీలు పర్యవేక్షించి, నిర్మాణ బాధ్యతలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. చాలా చోట్ల మౌలిక వసతులు లేక ఈ ఇళ్లు వృథాగా మారాయి. ఇప్పుడు ఇందిరమ్మ పథకం కింద వీటిని కేటాయించడం ద్వారా మౌలిక వసతుల కల్పనకు కూడా నిధులు కేటాయించే వీలుంటుంది.
లబ్ధిదారులు సొంతంగా నిర్మాణాలు పూర్తి చేసుకునే అవకాశం కల్పించడం వల్ల నాణ్యతతో పాటు, వేగంగా ఇళ్లు పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. ఏవరైనా పాత కాంట్రాక్టర్లు ముందుకు వస్తే వారికి కూడా ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉంది. ఇక ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. మొత్తం 4 విడతల్లో ఈ డబ్బులు అకౌంట్లలో జమ చేస్తున్నారు. నియోజకవర్గానికి 3500 చొప్పున ఇళ్లు మంజూరు చేయగా.. చాలా చోట్ల నిర్మాణాలు పూర్తయి గృహ ప్రవేశాలు పూర్తయ్యాయి. మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. రెండో దశ లబ్ధిదారుల ఎంపికకు రేవంత్ సర్కార్ కసరత్తు మొదలుపెట్టింది.





# నారీశక్తిని అడ్డుకున్నారు

(మొదటి పేజీ తరువాయి)
"మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ఒక రకంగా భ్రూణహత్యతో సమానం" అంటూ ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ 'పాపం' విపక్షాలను ఎప్పటికీ వదిలిపెట్టదని, దేశంలోని మహిళలు జరుగుతున్న ప్రతి విషయాన్ని గమనిస్తున్నారని చెప్పారు. మహిళల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన పార్టీలకు తగిన శిక్ష తప్పదని హెచ్చరించారు.
కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు గతంలో కూడా మహిళా బిల్లును పలుమార్లు అడ్డుకున్నాయని మోదీ ఆరోపించారు. ప్రస్తుతం కూడా అదే కుట్రలు, కుతంత్రాలు కొనసాగిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ స్థానిక పార్టీలపై ఆధారపడుతూ 'పరా న్న జీవిలా' మారిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. డీలిమిటేషన్ అంశంపై కూడా విపక్షాలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మోదీ ఆరోపించారు. ఏ రాష్ట్రానికీ నష్టం జరగదని, అన్ని రాష్ట్రాలకు లోక్‌సభలో ప్రాతిని ధ్యం పెరుగుతుందని స్పష్టం చేశారు. సీట్లు పెరిగితే కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ వంటి పార్టీలకూ లాభమేనని పేర్కొన్నారు.
సంస్కరణల విషయంలో కాంగ్రెస్ ఎప్పు డూ వ్యతిరేక ధోరణి పాటిస్తోందని మోదీ విమర్శించారు. జన్‌ధన్ యోజన, డిజిటల్ పేమెంట్స్, జీఎస్టీ, ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి కీలక నిర్ణయాలకు కాంగ్రెస్ వ్యతిరేకంగా నిలిచిందని గుర్తుచేశారు. ఉగ్రవాదం, నక్సలిజం వంటి అంశాల్లోనూ ఆ పార్టీ వైఖరి దేశానికి హానికరం అన్నారు. "సంస్కరణ అనే మాట వినగానే కాంగ్రెస్ వ్యతిరేకిస్తుంది. ప్రజలను తప్పుదోవ పట్టించడం ఆ పార్టీకి అలవాటు. దేశానికి మేలు చేసే ప్రతి నిర్ణయాన్నీ అడ్డుకోవడం కాంగ్రెస్ నైజం" అని మోదీ తీవ్రంగా విమర్శించారు. సైనికుల 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' వంటి అంశాలను కూడా కాంగ్రెస్ దశాబ్దాల పాటు నిలిపివేసిందని ఆయన గుర్తు చేశారు. దేశంలోని మహిళలు, యువత కలిసి ఈ అన్యాయానికి తగిన సమాధానం ఇస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.
చివరగా "నారీశక్తి ఎదుగుదలను ఎవరూ ఆపలేరు. మహిళా శక్తి దేశ భవిష్యత్తును నిర్దేశిస్తుంది. ఈ బిల్లును అడ్డుకున్నవారు తప్పకుండా మూల్యం చెల్లించుకుంటారు" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

## మహిళా బిల్లుపై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి
### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**
మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని ప్రదర్శిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు అరోపించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ శనివారం సీఎం నివాసం ముట్టడికి వెళ్లేందుకు సిద్ధమైన రాంచందర్ రావును పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో మహిళల గొంతు నొక్కారని, ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తున్నారని ఆరోపించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే సామాన్య మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. గత 30 ఏళ్లుగా మహిళా బిల్లును వాయిదా వేస్తూ వస్తోందని విమర్శించారు. తెలంగాణలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు నెలకొన్నాయని ఆరోపిస్తూ, మహిళల హక్కులను అడ్డుకున్న కాంగ్రెస్‌ను ప్రజలు క్షమించరని అన్నారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
19.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మద్యం బంద్ : ట్రిగ్గర్స్ గుర్తించండి**

- ఏ పరిస్థితుల్లో తాగాల-నిపిస్తుందో గుర్తించండి (స్ట్రెస్, ఫ్రెండ్స్, పార్టీలు)
- ఆ పరిస్థితులను తప్పించుకోవడానికి ముందే ప్లాన్ చేసుకోండి



# జగిత్యాల నుంచే జైత్రయాత్ర

- **రెండున్నరేళ్లు కాలయాపన చేసి ఇప్పుడు మేడిగడ్డకా..**
- **జగిత్యాల సభ ఏర్పాట్లను పరిశీలించిన కేటీఆర్, హరీష్ రావు**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**



జగిత్యాల నుంచి బీఆర్ఎస్ జైత్రయాత్ర ప్రారంభమవుతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. శనివారం పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తో కలిసి జగిత్యాల లోని మాజీ మంత్రి జీవన్ రెడ్డి ఇంటికెళ్లి ఆయనతో సమావేశమయ్యారు. అనంతరం పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 20న నిర్వహించనున్న బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా హరీశ్ రావుతో కలిసి కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి పార్టీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. సింహం బయటకు వస్తే గుంటనక్కలకు చెమటలు పడుతున్నాయని ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి రెండున్నరేళ్లలో మేడిగడ్డకు పోయేందుకు టైం లేదన్నారు. కాని జగిత్యాలకు కేసీఆర్ వస్తుంటే మాత్రం అదే రోజు సీఎం మేడిగడ్డకు వెళ్లడం వారి కుసంస్కారానికి నిదర్శనమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హైటే తక్కువ అనుకున్నాం, కానీ బుర్ర కూడా తక్కువగానే ఉందని విమర్శించారు.

**కేసీఆర్ రావాలి..**

పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజలు రేవంత్ రెడ్డి పోవాలి, కేసీఆర్ రావాలని బలంగా కోరుకుంటున్నారని తెలిపారు. రాజకీయ విలువలున్న సీనియర్ నేత జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ కు మరింత బలం చేకూరుతుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణను అవమానించిన తేజస్వి సూర్య వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటిదాకా కనీసం స్పందించలేదన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును ఇండియా పాకిస్తాన్ విభజనతో పోల్చడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బ తీయడమేనన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆ వ్యాఖ్యలను వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నాయకులు పాల్గొన్నారు.



## శోభాయమానంగా వసంతోత్సవం

- **అంగరంగ వైభవంగా శ్రీవారి నిత్య కళ్యాణం**
- **జల నారాయణ స్వామికి మంగళ హారతులు**

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి:**

స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దివ్యక్షేత్రంలో శ్రీ స్వామి వారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా అర్చక స్వాములు గావించారు. శనివారం ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవ శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువు తీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించారు. సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవ లోక కళ్యాణం కోసం శ్రీ సుదర్శన నారసింహ హవనంను చేశారు. అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళ హారతులు సమర్పించారు.







## దక్షిణాది రాష్ట్రాలకు ద్రోహం

- **కాంగ్రెస్, ఇండి కూటమిపై కేంద్ర మంత్రి బండి ధ్వజం**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ బిల్లును అడ్డుకొని కాంగ్రెస్, ఇండి కూటమి దేశ దక్షిణాది రాష్ట్రాలకు చారిత్రక ద్రోహం చేశాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. వెలుపల "దక్షిణాది గౌరవం" అంటూ నినదించే విపక్షాలు, పార్లమెంటులో మాత్రం ఆ ప్రాంత ప్రయోజనాలను కాపాడే బిల్లును చంపేశాయని విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆయన ఎక్స్ వేదికగా ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. 2026 తర్వాత జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలు తమ రాజకీయ ప్రాధాన్యతను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జనాభాను నియంత్రించి, విద్య, అభివృద్ధిపై పెట్టుబడి పెట్టిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల గొంతు నొక్కేలా సీట్ల సర్దుబాటు జరుగుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముప్పు నుండి దక్షిణాదిని కాపాడేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఒక రక్షణ కవచంలా 131వ సవరణ బిల్లును తెచ్చిందన్నారు. కానీ విపక్షాలు దానిని అడ్డుకుని రాజకీయ స్వార్థాన్ని ప్రదర్శించాయని మండిపడ్డారు. దక్షిణాది సీట్లను 50 శాతం పెంచేందుకు కూడా సిద్ధమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్ లో స్పష్టమైన హామీ ఇచ్చి ప్రకటించినా విపక్షాలు మౌనంగా ఉండిపోయాయని బండి సంజయ్ గుర్తు చేశారు. మహిళలకు న్యాయం చేసే, భవిష్యత్ తరాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించే ఈ చారిత్రక సంస్కరణను అడ్డుకోవడం ద్వారా కాంగ్రెస్ తన అసలు స్వరూపాన్ని బయటపెట్టుకుందని విమర్శించారు. ప్రధాని మోదీ ప్రతి ప్రాంతాన్ని రక్షించేందుకు కృషి చేస్తుంటే, విపక్షాలు కేవలం అధికారం కోసమే పాకులాడుతున్నాయని మండిపడ్డారు. ఈ ద్రోహాన్ని దేశ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని బండి సంజయ్ పేర్కొన్నారు.

# బీజేపీ డీలిమిటేషన్ కుట్ర భగ్నం

- **టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్**
- **మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డం పెట్టుకుని, అక్రమంగా బిల్లులు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**




మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డం పెట్టుకుని, అక్రమంగా డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) బిల్లును రుద్దాలని చూసిన బీజేపీ కుట్రను ప్రతిపక్షాలతో కలిసి కాంగ్రెస్ భగ్నం చేసిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ బిల్లు ద్వారా ఉత్తర భారతానికి అధిక సీట్లు కేటాయించి, దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయాలని చూసిన రాజకీయ ఎత్తుగడను కాంగ్రెస్ విజయవంతంగా అడ్డుకుందని చెప్పారు. శనివారం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అశాస్త్రీయంగా, చట్టవిరుద్ధంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవడం ప్రజాస్వామ్య విజయానికి నిదర్శనమని మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. 2010లోనే మన్మోహన్ సింగ్ ప్రభుత్వం రాజ్యసభలో మహిళా బిల్లును పాస్ చేయించిందని, రాజీవ్ గాంధీ ఆలోచనలతో పీవీ నరసింహారావు ప్రభుత్వం స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిందని గుర్తు చేశారు.

**ఒక్క బీసీ నాయకుడినైనా తయారు చేశారా?**

బీజేపీ ఒక మనువాద, బీసీ వ్యతిరేక పార్టీ అని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. కిషన్ రెడ్డి తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క బీసీ లీడర్‌నైనా తయారు చేశారా? అని సవాల్ విసిరారు. తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదని, రాష్ట్రంపై చూపుతున్న వివక్షకు శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్ విభజనతో పోల్చిన బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలపై బీజేపీ నేతల మౌనాన్ని మహేష్ కుమార్ గౌడ్ దుయ్యబట్టారు. దేశ నిర్మాణంలో దక్షిణాది పాత్ర గణనీయమని, దానిని తక్కువ చేసే ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు. మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో ప్రతిపక్షాలన్నీ ఏకమై కేంద్ర ప్రభుత్వ అప్రజాస్వామిక నిర్ణయాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

# కాళేశ్వరాన్ని బద్నాం చేశారు..

- **మాజీ మంత్రి ఎర్రవెల్లి దయాకర్ రావు**

**ముద్ర, మహదేవపూర్:**



యావత్తు ప్రపంచం మెచ్చుకున్న కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం బద్నాం చేసిందని మాజీ మంత్రి ఎర్రవెల్లి దయాకర్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ బ్యారేజ్‌ను శనివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పుట్ట మధు ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టును మహారాష్ట్ర ప్రభుత్వం, బీజేపీ నాయకులు సైతం అభినందించిన విషయం గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే కక్ష్యకట్టి మేడిగడ్డ బ్యారేజ్‌ను దోషిగా చూపించి మూడేళ్లుగా రాష్ట్ర రైతంగానికి అన్యాయం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులు జగిత్యాల సభలను ఫెయిల్ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డ బ్యారేజీకి వచ్చి ఏం చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు ఫిల్లర్లను సాకుగా చూపితే ప్రాజెక్టు పూర్తిగా కూలిపోయిందని ప్రచారం చేశారని ఆరోపించారు. మూడేళ్లుగా ఇక్కడ ఇసుక మాఫియా నడుస్తుంటే మంత్రి శ్రీధర్‌బాబు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఉపయోగపడలేదని నిరూపిస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి రాజయ్య, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, మాజీ ఎంపీ మలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు శంకర్ నాయక్, అరూరి రమేష్, దాసరి మనోహర్ రెడ్డి, గండ్ర వెంకటరమణ రెడ్డి, బీఆర్ ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి, జెడ్పీ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాడు చెల్లని రూపాయి.. నేడెలా చెల్లుతుంది?

- **సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తే ఊరుకోం**
- **మీడియా సమావేశంలో మంత్రి అడ్లూరి**

**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**

జగిత్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 20న నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ మీటింగ్ జీవన్ రెడ్డి చేరిక సభనా..? బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభనా..? ప్రకటించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో మోతే రోడ్ లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నందయ్య, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ,మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణితో పాటు పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఎక్కడ బహిరంగ సభలు ఏర్పాటు చేసుకున్న తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. కేవలం 12 నుండి 15 వేల మందితో సభ నిర్వహించుకునే స్థలంలో భారీ జన సమీకరణ ఏలా చేస్తారని మంత్రి ప్రశ్నించారు. సీనియర్ నాయకులు జీవన్ రెడ్డి పార్టీ వీడడం బాధాకరమని, వెళ్తు.. వెళ్తు అసత్య ఆరోపణలు చేయడాన్ని మంత్రి ఖండించారు. జీవన్ రెడ్డి నాడు చెల్లని రూపాయిని కేటీఆర్ ఎన్నికల ప్రచార సమయంలో మాట్లాడి.. నేడు బీఆర్ఎస్ లో ఎట్లా చెల్లుబాటు అవుతుందని మంత్రి ప్రశ్నించారు. జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలంగా ఉందని జీవన్ రెడ్డి పార్టీ మార్పుతో పెద్దగా నష్టం జరిగేది ఏమీ లేదని మంత్రి అన్నారు. జీవన్ రెడ్డి రోడ్లు భవనాల శాఖ మంత్రిగా పనిచేసినప్పటికీ ఏ నాడు జగిత్యాల లోని రోడ్లను పట్టించుకోలేదని ఎమ్మెల్యే ఆరోపించారు. జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధికి రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతో తాను కలిసి పని చేస్తానని ఎమ్మెల్యే వివరించారు. మాజీ మంత్రి జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ప్రాధాన్యమిచ్చిందని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందయ్య అన్నారు. 1985 నుండి 2024 వరకు జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ బీఫామ్ కావాలని దరఖాస్తు చేసుకున్న రెండో వ్యక్తి లేడని దీన్నిబట్టి కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో అర్థం చేసుకోవాలని అన్నారు.

# సీఎం నివాసం ముట్టడి ఉద్రిక్తం

- **మహిళా బిల్లు విషయంలో కాంగ్రెస్ వైఖరిపై బీజేపీ మహిళా మోర్చా నిరసన**
- **వందలాది మంది మహిళా కార్యకర్తల ప్రదర్శన**
- **అడ్డుకున్న పోలీసులతో వాగ్వాదం, అరెస్ట్**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

పార్లమెంట్‌లో మహిళా బిల్లుల విషయంలో కాంగ్రెస్ అనుసరిస్తున్న తీరుకు నిరసనగా నేడు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45 రణరంగంగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడించేందుకు బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి నాయకత్వంలో వందలాది మంది మహిళా కార్యకర్తలు నిరసన ప్రదర్శనగా సీఎం రేవంత్ రెడ్డి ఇంటి వైపు దూసుకెళ్లారు. వీరి రాకపై ముందుగానే సమాచారం అందుకున్న పోలీసులు జూబ్లీహిల్స్ రోడ్లన్నీ బారికేడ్లతో మూసివేసి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే.. మహిళా నేతలు పోలీసుల బారికేడ్లను తోసుకుంటూ ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర తోపులాట, వాగ్వాదం జరిగింది. దీజతో పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ రోడ్డుపైనే బైఠాయించిన మహిళా కార్యకర్తలను పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లి వాహనాల్లోకి ఎక్కించారు. శిల్పారెడ్డి సహా పలువురు ముఖ్య నేతలను అరెస్ట్ చేసి స్థానిక పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా.. నారీశక్తికి ద్రోహం చేసిన కాంగ్రెస్ నశించాలి అంటూ మహిళా మోర్చా నేతలు చేసిన నినాదాలతో జూబ్లీహిల్స్ మార్మోగింది. అరెస్ట్ సమయంలో శిల్పారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతుంటే పోలీసులతో అణచివేయాలని చూడటం హేయమైన చర్య అని విమర్శించారు. ఈ ముట్టడి యత్నం నేపథ్యంలో జూబ్లీహిల్స్ పరిసర ప్రాంతాల్లో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది.



# ఎదలోని ఉద్వేగం -ఏడుకోలల బాయి

**""ఎంత ఖర్చయినా పర్వాలేదు" మా అన్నయ్యని బతికించండి' ఇది 'ఠాగూర్' సినిమాలోని ఒక డైలాగ్.**

ఈ నిర్వాకం ప్రైవేటు హాస్పటల్లో జోరుగా సాగుతున్న విషయం మనకు తెలిసిందే. అచ్చం ఇలాగే మన రాజకీయ నాయకులలో ఎలక్షన్లు వచ్చాయంటే 'ఎలాగైనా గెలవాలి' అనే ఎన్నికల వ్యసనం చేత ఎన్ని అబద్ధాలైనా చెప్పి,ఎన్ని మోసాలైనా చేసి,ఎన్ని హామీలైన ఇచ్చి గెలిచేందుకు ఓట్లు అడుక్కుంటున్నారు. మనీ,మందు,బీరు,బిర్యానీలిచ్చి ఓట్లను కోనుకుంటున్నారు. చివరకు కుత్సితపు గుణంతో కులాల మధ్య చిచ్చులు పెట్టి ఓట్లు దండుకొంటున్నారు. మత మౌఢ్యపు మత్తు మెదడుకెక్కించి, మూఢనమ్మకాల్లో ముంచి ఓట్లను కాజేస్తున్నారు. ప్రాంతాల మధ్య పగల పొగలు లేపి ఓట్లను లాగేసుకుంటున్నారు. అమాయక ఓటర్లు తాత్కాలిక ప్రయోజనమాశించి ఓటు గుద్దుతున్నారు.

నిజంగా రాజ్యాన్ని బాగుచేసే మంచి వ్యక్తిని ఎన్నుకోవడంలో తన బుద్ధిని కాస్త పక్కకు నెట్టి ప్రలోభాలకు గురవుతున్నారు.

అందుకే 'ప్రజాకవి కాళోజీ నా గొడవ' లో ఓటరుని ఇలా మందలిస్తాడు.

" ఓటిచ్చు అధికారమున్నట్టి వారు
ఎన్నికల సమయమున తిన్నగా వినుడు
మట్టి బానలు కొనిన కొట్టి చూచెదము
సరుకు కొన వీదెల్ల తిరిగి చూచెదము
అనుచుంటిని మాట అనుభవము కొద్ది
ఓటిచ్చినప్పుడుండాలి ఓటరుకు బుద్ధి"

జాగ్రత్త' కవితలో అలిశెట్టి ఓటర్లను హెచ్చరిస్తాడిలా..

''జాగ్రత్త
ప్రతీ ఓటు
ఒక పచ్చి నెత్తురు మాంసం
చూస్తు చూస్తూ వేయకు ఎదో గద్దకు
అది కేవలం కాగితం మీది గుర్తు కాదు
జీవితం కింద ఎర్తు''

అని ఓటు విలువను చాటి చెబుతాడు.

నేడు మన భారతదేశంలోనైన,ఏ రాష్ట్రంలోనైనా,మన తెలంగాణలైనా ఎలక్షన్లు వచ్చాయంటే నాయకులు టికెట్ల కోసం పార్టీ ఆదినాయకత్వానికి ఎంతిచ్చైనా బీ-ఫామ్లు సాధిస్తున్నారు.ఒకవేళ నిరాశెదురైనచో విలువలు,సిద్ధాంతాలు వదిలేసి లీడర్లు 'కొత్త సీసాలో పాత సార' మాదిరి టికెట్ ఇచ్చే పార్టీలోకి జంపుజలానిలవుతున్నారు. ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్నారు.

దీనికి నిదర్శనం ఈ కింది పద్యం

" ఏ పూట ఎవ్వడు ఏ పార్టీల ఉండునో
ఏమాత్రమును ఎవడెరుగ లేడు
ఎవని చంకన దూరి ఎవని పంచన జేరి
ఎవడెట్లు వాగనో ఎరుగలేము
ఎటు టిక్కెట్టొచ్చునో అటుదూకు గోపీలు
అన్ని గుంపులలోన మిన్నగుండ్రు
కన్ను గీటితే చాలు కదిలిపోయేటట్లు
బుద్ధి జీవులుగూడ సిద్ధమండ్రు. "

'మాకియవెల్లీయ' అనే రచయిత "ది ప్రిన్స్" అనే రచన రోమన్ సామ్రాజ్యాన ఇటలీ పునర్వైభవం,ఉజ్వల భవిష్యత్తునాశించి దాని పునర్నిర్మాణం కోసం 'ఎలాగైనా' రాచరికముతో అధికారం చెలాయించాలని యువరాజుకు చేసే ఉద్బోధ గ్రంథం. 'ఎలాగైనా' అనే దాంట్లో మోసం,అబద్ధం, దగా,చంపుట,బలత్కరించుట,అణిచివేయట లేదా బుజ్జగించుట,లంచాలు,అవసరమున్న వాటినిచ్చుట, సార తాపుట,డబ్బులిచ్చుట, కుల, మత, ప్రాంత వైషమ్యాలను రెచ్చగొట్టుట ఇలా ఎట్లైన అధికారంలోకి రావాలని చెప్పారు. దానినే 'మాకీయ వెల్లీయ' రాజకీయాలంటాం. మన వద్ద ఊసరవెల్లియ రాజకీయాలుంటాయని ప్రముఖ కవి, విమర్శకులు సీతారాం గారంటారు.

గెలిచిన ఏలికలు ప్రజల క్షేమంకై పెద్దధికారుల సూచనలు తోసేసి ఇలా వ్యవహరిస్తారు.

" వీధిలోన ఉండుటే అధికారి పనిగాదు
మనము జెప్పిన మాట వినగవలెను
రూల్సు గీల్సూ అంటు ఫాల్స్ మాటలు చెప్తె
తుప్పలూ తంగేళ్లు తప్పవౌర
సిట్టంటే కూర్చొని స్టాండంటే నిలుచునే
అధికారులే మాకు అవసరమ్ము
కానీ పనులు గూడ కచ్చితంబుగ జేసి
మెప్పించు వారలే మేలు మాకు
అట్టి వారినే కూర్చుండ బెట్టుతాము
మంచితావుల నన్నింటి నెంచి చూసి
మాట వినినోన్ని ఓ మూల సీటుజూసి
ఉనికి లేనట్టి పోస్టులో ఉంచుతాము"

గ్రూప్ వన్ ఆఫీసర్ డా.ఏనుగు నరసింహ రెడ్డి 2023 అసెంబ్లీ ఎలక్షన్ల అక్షరముక్క రాని నాయకుల తీరుకు కలతచెంది,నీచ ప్రచార జోరుకు ఉద్వేగమొంది ఆవేదనతో తనలోని కవిని మేలుకొల్పి,అక్షరం వైపు మళ్ళించి, సీస పద్యాల గడ్డపారలచే 'ఏడుకోలల బాయి'ని తవ్వినారు. అందలి కావ్య జలంచే ఉగ్ర నరసింహుడు కొంత శాంతించారు.

ఏడుకోలల బాయొక ఎన్నికల శతకం 101-సీసపద్యమాలిక సమహారం. సీస 'పద్యాలకు పెట్టింది పేరు శ్రీనాథ మహాకవి'యని తెలిసిందే. మన ఆధునికాలంలో ఈ సీసాలతో 'ఏ.న.రె' గారు కొత్త ప్రయోగాలు చేసినారు అవేంటో చూద్దాం.

మొదటిది:- సహజంగా సీసం చివర ఆటవెలదో,తేటగీతో ఉండాలి. సాధారణంగా ముగింపు పద్యంలోనే చివరి పదంగానీ లేక ఏకపాదంగానీ లేద ద్విపాద మకుటాలుండాలి. కానీ డా. ఏనుగు నరసింహ రెడ్డి గారు ముగింపు పద్యాన్ని కూడ వస్తువు విచికిత్సకై పెద్ద క్యాన్వాస్ గా వాడుకున్నారు. ఐతే మకుటం కోసం మరో తేటగీతిని చేర్చారు. అనగా సీసం చివర రెండు తేటగీతి పద్యాలు రాశారు. ఇంతవరకు ఇలా ఏ కవి రాయలేదు. మన కవి కొత్త ఒరవడికి నాంది పలికారు.

**రెండోది: - ఇప్పుటి వరకు పద్యాలు రాసిన కవులందరు చివరి ఏకపదమో లేదా చివరిదొక పాదమో లేదా చివరి రెండు పాదాలతో మకుటాలను రాసియున్నారు.**

అయితే..

"మాయ మాటల హామీల మర్మమెరిగి
గుర్తు లేకుండా ఓటేట్ల గుద్దుతావు
ఓరి వెంకన్న! దోస్తుగా! ఒర్లుబోతు!
ఒక్క మాటన్న వినవారా! తిక్కలోడ"

అంటూ నాల్గు పాదాల మకుటంను మన 'ఏ.న.రె' గారు రాసి సరికొత్త సంప్రదాయం మొదలెట్టారు.

ఈ మకుటంలోని మర్మమేమనగా.. ఓట్ల కోసం వచ్చే నాయకులు చెప్పే మాటలు,హామీలు రేపటికి అమలు కాగలవా.. అనేది గుర్తుంచుకోని ఓటు వేయిరా దోస్తుగా.. నీవసలే మంచి చెడుల విచక్షణ చేయవు ఊకనే నోరుందని అయింది,కానిది ఓర్లుతుంటావు యంటు సగటు ఓటరుకు ప్రతీకగా దోస్తు వెంకన్నగా భావించి ఆ ఓటరును జాగ్రత్త పర్చుతుండడమునే మకుటంగా తీసుకోడంలో కవి గారి లోతైన విశ్లేషణా పటిమ,సమయస్ఫూర్తి, వ్యంగ్యం, చాకచక్యం, సాహిత్యం, అందునా పద్య రచనలో తనకు గల ప్రవేశ్యంలు మనకు గోచరమగును.

మూడోది:- సాధారణంగా సంస్కృత, సంప్రదాయ పదాలతో కూడిన ప్రౌఢమైన భాషను వాడి పద్యాలు రాయడం జరుగుతూ వస్తుంది. దీన్ని కాస్త పక్కన పెట్టి, స్థానిక,వ్యవహారిక భాష పదాలు,ప్రజల పలుకుబడులు,నుడికారాలు వాడుతూ.. అవసరమున్నచోట మనతో అనుబంధమున్న ఉర్దూ, హిందీ, ఆంగ్ల పదాలను కూడ వాడి ఈ కృతిని చంధోబద్దంగా తీర్చిదిద్దారు. కింది పద్యం చూడండి.


"బుర్దమట్టల టేస్టు అర్థమౌ కొందర్కి
కొరమట్టలే బెస్ట్ కొందరికిని
నాటుకోడుల కూర సూటౌను కొందర్కి
లెగ్గు పీసులె బెస్టు పెగ్గు నడవ
పీత కూరలు గోరి ప్రీతిగా భుజియింత్రు
రొయ్యలే కొందర్కి రుచికరమ్ము
మేకమాంసపు కూర మేలైన తల్కాయ
శోరువా మెక్కుదుర్ సొల్లుగార
నీసు లేకుండ తినుడెట్ల నిక్కరముగ
పూట పూటకు కం సె కం బోటి వలయు
ఖీంచు కట్ లేని దావతు నించుటెట్లు
ధనము లేకుండ పాలిటిక్స్ దండగనెడు"

బుర్దమట్టలు,కొరమేనులు,నాటుకోడి, పీతలు,రొయ్యలు,మేక మాంసము తల్కాయ,శోరువా,మెక్కుదురు,సొల్లుగార, నీసు, బోటి మొ|| అచ్చమైన మన తెలంగాణ మాండలిక పదాలు. అలాగే టేస్టు,బెస్ట్,సూటవును, లెగ్గు, పెగ్గు, కం సె కం, దావతు, ఖీంచు కట్, పాలిటిక్స్ మొదలైనవి మన సహచర భాషాపదాలు.

ఇలా 'ఏడుకోలల బాయి'నిండా తెలంగాణ మాండలికాలు,ఇతర భాషా పదాలుంటాయి.

జీవరాశులలో మనిషిని మించి తెలివితేటలున్న జీవరాశియున్నప్పటికి మానవపరిణామ క్రమంలో మెరుగుగా జీవిస్తునే నాయకత్వ లక్షణాలతో గుంపు నాయకుడై,రాజ్యాలు స్థాపించుట మొదలెట్టాడు మానవుడు.

కొందరు ఆదిపత్యధోరిణితో,రాచరికంతో నియంతలుగా మారారు. "రాజ్యం వీరభోజ్య'మయింది. ప్రజలు కొన్ని శతాబ్దాలుగా అణిచివేయబడ్డారు, ధీనవస్తలో,సుప్తావస్థలో మగ్గినారు. క్రమంగా ఫ్రెంచ్ విప్లవం,మార్క్స్ వర్గపోరాటం,పారిశ్రామిక విప్లవాల ప్రభావంచే ప్రజాస్వామిక భావనలు ప్రపంచంలో మొదలయ్యి, రాచరికం తుడుచుకుపోతూ ప్రజాస్వామ్య దేశాలు




ఆవిర్భవించాయి. ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులు దేశాన్ని పాలించడం ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క ప్రధాన లక్షణం అనగా 'ప్రజల చేత ప్రజల కోసం ప్రజలే పాలించుకోవడం' ప్రజాస్వామ్యమని అమెరికా మాజీ అధ్యక్షుడు 'అబ్రహం లింకన్' ఏనాడో సెలవిచ్చారు.

మన భారతదేశం కూడా పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను రాజ్యాంగంలో పొందుపరచుకొని 1952 నుండి ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లడం జరిగింది. ప్రజాస్వామ్య గుండెకాయకు జీవనాడులు ఓట్లు. ఈ ఓటుహక్కు 18సం,లు దాటిన ప్రజలకుంటుంది. ఎక్కువ ఓట్లు గెల్చిన నాయకులు 5సం,ల కాలానికి ప్రజల తరుపున పాలకులవుతారు. ఇదంతా నిర్వహించడం 'ఎన్నికల సంఘం'యొక్క విధి యవుతుంది.ఇట్లా రెండు,మూడు దశాబ్దాల వరకు దాదాపుగా మంచి ఆదర్శంగానే ఎలక్షన్లు నడిచాయి.

అప్పటి నాయకుల ప్రచార తీరిలా యుండెను.

"తొలి ఎన్నికలలోన మలి ఎన్నికలలోన
నాయకులను వారి నమ్రతెంత?
పాదయాత్రకు బోతె పరిశీలనే పని
కార్యకర్తలనంత కలుపుకోని
సచివులొచ్చిన గాని సరళమౌ మర్యాద
కారు జీపుల గుంపు బారులేదు
అధికారగణముతో మృదువైన భాషణ
కస్సుబుస్సుల నెప్డు కనగలేదు
హట్టహాసాలు ఆనాడు పుట్టలేదు
దోపిడీ అన్న మాటసల్ తోచలేదు
నాయకుండంటె ఎదలోన పాయకుండె
నల్గురికి సాయపడుటయే నతడుజేయు"

అప్పుడు ఎన్నుకోబడ్డ నాయకులు స్వభావంమిలా..

" ఒంటి చెప్పుల జోడు జంట బట్టల జత
ఉంటే చాలనుకుని ఉండువాడు
ఒక చేత పుస్తకంబొక సంచి మెడలోన
సామాన్యులతొ జేరి సాగువాడు
పార్టి కార్యాలకూ ప్రజలు పిల్చినపన్కి
ఒక్కంత శ్రద్ధతో ఉరుకు వాడు
ఎవరు మాటాడిన ఎట్టి భేదము లేక
మర్యాదగా పలుకు మాట తీరు"

ఇంతటి మహానాయకుడు ప్రజాప్రతినిధిగా ఎన్నకొన్న ప్రజలు నిస్వార్థులు.

ఇంకా అప్పటి,ఇప్పటి ప్రజాప్రతినిధుల తీరిలా..

"ఎంపీలు వెళుతుండ్రి ఎర్ర బస్సులనెక్కి
పియ్యేలు అను మాట తియ్యకుండ
సభలోకి ఎమ్మెల్లె సైకిలెక్కొస్తుండె
తను కూడ మామూలు మనిషినియె
ఇప్పుడొచ్చు ఎమ్మెల్లె ఇవరమే దొరకదు
కారు జీపుల గుంపు బారులోన
ఎటులొచ్చునో ఎంపి ఎవరూహిస్తారు
తీరైన కాన్వాయి తీరులోన
ప్రజల సొమ్ముకు బాధ్యతే పట్టదెట్ల
ఎంత పని చేస్తే ఫలమొచ్చు ఎంతకెంత
అనుచు విచికిత్స చేయుట అసలులేదు
కనుక మునిగేను జనసామ్యమనెడు పడవ"

ఇలా జనం సొమ్మును వృధా చేయడమే గాక వారిని తన చెప్పు చేతుల్లో ఉండాలని, కుక్కల్లా తమ పట్ల గుడ్డి విశ్వాసంతో ఉండాలనే మూర్ఖాలోచనతో వారి ముందు ప్రేమ,వారెనుక బానిసల్లా చూస్తు వారి ప్రయోజనాలకు అడ్డుపుల్లలేసే స్వార్థ నాయకులున్నారని కవి బాధపడ్తారిలా..

" జరుగుతున్న పనులు జరగవద్దని చెప్పి
అధికారులను పంపి ఆపమనుట
లబ్ధిదారుడు వచ్చి లబలబా మొతుకుంటె
అధికారులదె తప్పు అంటు అరిచి
చట్టాల పరిధిలో జరిగేటి పనులను
తప్పించి తన వైపు తిప్పుకొనుట
ప్రజముందు ఒక మాట ప్రైవేటుగా ఓటి
అధికారులకు జెప్పి ఆగపరచు చేయవద్దంటే
ఒకసారి చేయమనుట
చేయమని అంటె ఒకసారి చేయవద్దు
అనెడి అర్థాలు సృష్టించి అటుగ నిటుగ
మాయగాడాయె ఈరోజు నాయకుండు"

ఇంకా " చిన చిన్న పనికిని మన వద్దకే వచ్చి సన్నగా గొణగాలె సాయమునకు సర్కారులో పని సాఫీగా జరగొద్దు
మనని అడిగి చేయాలే పనులన్నీ" యని కోరుకొంటారు. మంచి యన్న వాని నెగలనీయక ముంచుతారు,చెప్పినట్టు వినువాడు, దోపిడీలు జేసి తనకొంతప్పజెప్పువాడే మంచివాడందురు

**అంటే.. ప్రజల తరుపున పాలనపోయి, ప్రజాస్వామ్యం తిరిగి ప్రజల మీదికే 'బుస కొడుతూ తిరగబడుతుంది' మన దేశంలో అంటాడు అలిశెట్టి ప్రభాకర్ ఇలా..**

**"స్వయాన శవాలే
రాబందుల వద్దకి
నడిచేస్తుంటే
అంతకంతకూ
పెరుగుతున్న
అజ్ఞాన పర్వతం
చిన్న బ్యాలెట్ పెట్టెలో
ఇమిడి పోతే..
మళ్లీ..
కోటీశ్వరుడి పుట్టలోంచి
బుసగొట్టదే
ఈ దేశపు ప్రజాస్వామ్యం"**

అదుకే ఇలాంటి చెడ్డ ఎన్నికల వ్యవస్థ,బహుచెడ్డ నాయకులు, కుళ్ళి కంపు గొడుతున్న రాజకీయ వ్యవస్థను బాగుచేయాలని, ఎలక్షన్ల తీరులో మార్పులు రావాలని మేలైన వ్యవస్థ కోసం పలు సూచనలు చేస్తారు మన కవనమూర్తి 'ఏ. న. రె' గారు.

అవి:-

1.బహుళపార్టి విధానం వ్యవస్థను పాడుచేస్తుందని, గ్రేట్ బ్రిటన్ల, అమెరికా వంటి దేశాల్లో ఉన్నట్లుగా రెండు పార్టీలుండుటే మేలని,ఒక్క పార్టియున్న చైనా చాలా అభివృద్ధి చెందుతలేదా..!? అంటూ ఇలా చెప్తారు.

" రెండంటె రెండు పార్టీలుండు రాజ్యమే
మొదలు పెట్టెను ఓటు మోడలవగ
అగ్రరాజ్యము చేయు అనువైన పాలన
రెండు పార్టీలతో నుండెను గద
తూర్పు దేశాలలో తురుముఖానగు చైన
ఒక్కటే పార్టితో చక్కబడియె
బహుళపార్టి జనవాద బలమేమియును లేదు
అవినీతితో వృద్ధి అడుగువట్టె
పాలనతో పాటు మారాలి 'పోలు' స్థితిలు
ఓటుకును నోటు బంధమ్ము దాటవలెను
రెండు పార్టీల పద్ధతుల్ ఉండనేని
డబ్బు లంకెలు కొంతైన దస్సిపోవు"

**2.ఖర్చులెక్కువ పెట్టు నేటి ఎన్నికల ప్రచారం తీరు మారాలంటు ఖర్చు తక్కువగునట్లు, పోటీ చేస్తోన్ని చరిత్ర, వారి పాలనా దక్షతను చూపునట్లు ప్రచారమిలా ఉండాలంటారిలా..**

"బహిరంగ సభలకు బదులుగా బహుపార్టి
చర్చలన్ జరపొచ్చు ఖర్చు లేక
ప్రజలెన్నొ విధముల ప్రశ్నలభ్యర్థిపై
సంధించగా వచ్చు సాత్వికముగ
డబ్బు కట్టడి జేసి ఇబ్బంది సవరించి
సమమౌ ప్రచారంబు సర్వులకును
ఎన్నిక సంఘమే అన్ని వివరములన్
అభ్యర్థులను గూర్చి అందజేసి
దుష్కరములను వేగ పరిష్కరించి
డబ్బుకను ఎన్ని కలకున్న జబ్బు మాపి
మాటకున్ చేతకున్నట్టి మార్పులెల్ల
తుడిచి ఏసేసి ఎన్నికల్ నడపవలెను"

అలాగే ఓటింగ్ అన్లైన్ల పెట్టోచ్చని, ఆధార్ థంబుతో డుప్లికేట్ ఓటర్ని గుర్తించొచ్చని అంతా సజావుగ ఉంటదియంటూ..

"రాజుల్ మత్తులు వారిసేవ నరక ప్రాయంబు, వారిచ్చు నం
భోజాక్షీచతురంత యాన తురగీ భూషాదులాత్మ వ్యథా
బీజంబుల్, తదపేక్ష చాలుఁ, బరి తృప్తిం బొందితిన్ జ్ఞానల
క్ష్మీజాగ్రత్పరిణామ మిమ్ము దయతో శ్రీకాళహస్తీశ్వరా!"

అంటూ..

'రాజాస్థానంలో ఉండికూడా మహాకవి ధూర్జటి రాజులను దూషించినట్లు'గాక, సామాజిక స్పృహతో, దయార్థ హృదయంతో విలువైన సూచనలు చేషారు కవివర్యులు శ్రీ 'ఏ. న. రె' గారు.

'ఏడుకోలల బాయి' అన్ని పార్శ్వాలతో ఒక ఎన్నికల భాగోతాన్ని బయటపెట్టిన శతకం.

ఎన్నో కలలతో ప్రజాస్వామ్యం మొదలయినా స్వార్థ రాజకీయ నాయకులు ఎన్నికల్లో పిల్లిగంతులు వేస్తూ గెలిచి,పంట రసం పీల్చు పురుగుల వలె ప్రజలను పీల్చి పిప్పిజేసి వారి ఆస్థిని గుట్టలు గుట్టలుగా పోగేస్తున్నారు. చైనా దేశంవలె అవినీతి పాలకులకు కఠిన శిక్షలతో చెరసాలలో చిప్పకూడు తినిపిస్తుంటే కొంత మర్పురాగలదు.

కవి ఏనుగు నరసింహ రెడ్డి గారి ఏడుకోలల బాయి ఎన్నికల శతకం,పూర్వ ప్రజాస్వామ్యాన్ని తిరిగి నిలబెట్టుటకు ఉపయోగపడె పద్య శకటం.ఇందు

సరళ భాష,ఉధృత భావం,ధార నిర్దోషం, ఆలోచనాత్మక సందేశం వంటి సుగుణ సంపద కలిగిన కావ్యం.

కల్లోనికుంటన జన్మించి, చిట్యాలన పెరిగి, పెద్దయ్యి, ప్రయోజకుడైయ్యి, నేడు కలెక్టర్ కాగల "ఐఏయస్" అయినా.. "కవి" గానే యుండడమే ఇష్టమంటారు 'డా. ఏ. న. రె' గారు. ఇప్పటికే పద్దెనిమిది రచనలు చేసారు. ఏడింటికి సంపాదకత్వం వహించారు. తన 'మూలమలుపు','కొత్త పలకలు' కవితా సంపుటులు ఆంగ్లంలోకి అనువాదమయ్యాయి.పొందిన బహుమతులు, పురస్కారాలు ఇరువైరెండుకు చేరుకున్నాయి. ఇంకా మహోన్నతమైన స్థాయికి చేరుకోవాలని కోరుకుంటూ.. ముగిస్తున్న.

### ఆధార గ్రంధాలు

# ఏడుకోలల బాయి ఎన్నికల శతకం -డా. ఏ. న. రె
# నా గొడవ -కాళోజీ నారాయణ రావు
# శ్రీకాళహస్తీశ్వరా శతకం -ధూర్జటి
#.ఎన్నికల ఎండమావి - అలిశెట్టి ప్రభాకర్
# ఎన్నికల జీవిత చరిత్ర - జీవన విధాన చరిత్ర శతకం -డా. సీతారాం

**(నేడు తేదీ. 19-04-2026 'డా. ఏనుగు నర్సింహా రెడ్డి IAS' గారికి తన సొంత గ్రామం చిట్యాల నందు జరగబోయే "పౌర సన్మానం" సందర్భంగా...)**

**ఇట్లు/ ఏ.న.రె అభిమాని,**

**దాశీ
దాసరి శ్రీరాములు
తెలుగు అధ్యాపకులు
నాగార్జున సాగర్,9885500278**



### ముచ్చటగా మూడుగంటలు జరిగిన కాలిఫోర్నియా వీక్షణం 164వ అంతర్జాల సాహితీ సమావేశం

# ముచ్చటగా వీక్షణం 164వ సమావేశం

శనివారం ఉదయం 6 గంటల 30 నిమిషాల నుండి మూడు గంటలు వీక్షణం 164వ సమావేశం ముచ్చటగా జరిగింది. వీక్షణం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ గీతామాధవి కవితా ప్రియులకు స్వాగతం పలికారు. ప్రముఖ కవయిత్రి డాక్టర్ కొండపల్లి నీహారిణి గీత మాధవిని పరిచయం చేసి వారి కధాపఠనం చేయవలసినదిగా ఆహ్వానించారు. గీతా మాధవి ఈ మధ్యనే ప్రతిష్టాత్మక వంగూరి ఫౌండేషను పురస్కారం పొందిన అటానమస్ ఏజంట్ అనే కథను భార్యా భర్తల సంవాదంగా చక్కగా హావభావాలతో వినిపించి సభికులను ఆకట్టుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెల్లిజెన్స్ (కృత్తిమ మేధస్సు) గురించి చక్కగా వివరించారు. డాక్టర్ కొండపల్లి నీహారిణి కధను సమీక్షించి కథ అద్భుతముగా ఉందని, చదవటం హృద్యంగా ఉందని అభినందించారు. పిమ్మట వీక్షణం భారతీయ ప్రతినిధి గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, కావలి కవి రామా యణం ప్రసాదరావు మంచికవితను వినిపించినందుకు డాక్టర్ గీతకు హార్థిక అభినందనలు తెలిపారు.

పిమ్మట గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ , బిటవరం శ్రీమన్నారాయణ కలసి కవిసమ్మేళనం అద్భుతంగా నిర్వహించారు. గీతా మాధవి ఓ చిట్టి తల్లి.. చిన్నారి తూనీగా అంటూ భావాత్మక, కవితాత్మక కవితను చక్కగా చదివారు. అరుణ కీర్తి పతాకరెడ్డి ఓ చక్కని గేయాన్ని, గంటా మనోహర రెడ్డి ఘంటారావం అనే కవితను, అయ్యల సోమయాజుల ప్రసాద్ ధర్మపత్ని , తనయ గురించి, రామాయణం ప్రసాదరావు ఆమే అలక అనే హాస్య కవితను, మోటూరి నారాయణరావు 'ఓ చిరు ఆశ - అదే నా శ్వాస ' అనే కవితను, కోదాటి అరుణ పదాలు తడబడే అనే గజల్ ను, అవధానం అమృతవల్లి యుద్ధం భూతలానికి పెద్ద శాపం అనే కవితను, బిటవరం శ్రీమన్నారాయణ వింత వ్యాపారం అనే కవితను చక్కగా వినిపించారు. పిమ్మట డాక్టర్ చీదెళ్ళ సీతాలక్ష్మి వేగానికి కళ్ళెం అనే తన స్వీయ అనుభవాన్ని, పరిమి వెంకట సత్యమూర్తి కందుకూరి వీరేశలింగం పై కవితను, ఉప్పలపాటి వెంకటరత్నం యుద్ధము - శాంతి అనే కవితను, పరాంకుశం క్రిష్ణవేణి స్వేచ్ఛా మైదానం అనే కవితను, డాక్టర్ బలుసాని వనజ కాలంతోనే నే కలసి సాగనా అనే కవితను, డాక్టర్ బృందా ఆరోగ్యం పై కవితను, భోగెల ఉమామహేశ్వరరావ సమతుల్య జీవనం పై కవితను, యువ కవయిత్రి ఆనం ఆశ్రితారెడ్డి నా దేశ ప్రతిభ అనే కవితను, ఆలపాటి సత్యవతి మౌనం పై కవితను, శోభా దేశ పాండే వేడి పై కవితను, డాక్టర్ దేవులపల్లి పద్మజ యుగకర్త సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పై కవితను, కందుకూరి శ్రీరాములు ఇప్పుడు తెలిసిందా కవితను, నాళేశ్వరం శంకరం చెమట పూసలు కవితను, గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ ఓ అక్షర సైనికా అనే కవితను చక్కగా చదివి పాల్గొన్న వారిని అందరినీ అలరించారు. వీక్షణం భారతీయ ప్రతినిధి గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్ సమావేశంలో పాల్గొని అద్భుతమైన కవితలను వినిపించి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పాల్గొన్న కవులు అందరికి ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ గీతా మాధవి నిర్వాహకులతో సహకరించి చక్కని కవితలు ఆలపించిన కవులకు ధన్యవాదాలు చెప్పి కార్యక్రమాన్ని ముగించారు.




**- గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,
భాగ్యనగరం, వీక్షణం భారతీయ ప్రతినిధి.**

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 19.04.2026
www.mudranews.in | @mudranews

5

దక్షిణ తెలంగాణ
హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్
Hyderabad, Rangareddy, Mahabubnagar

**మద్యం బంద్:**



మెల్లగా తగ్గించడం ప్రారంభించండి. ఒక్కసారిగా మానడం కష్టమైతే క్రమంగా తగ్గించండి. రోజులు లేదా పరిమాణం మీద లిమిట్ పెట్టుకోండి

## సంక్షిప్తంగా..

### రోడ్డు భద్రతపై అవగాహన



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా రోడ్డు భవనాల శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ తీగల సునీంద్ర హాజరై ప్రజలకు రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేశారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డిప్యూటీ ఇంజనీర్, సిబ్బంది పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించా లని కోరారు.

### 19న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లాలోని ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను జిల్లా విద్యా శాఖాధికారి రమేష్ కుమార్ విడుదల చేశారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష 19న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశ పరీక్షలు అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతాయని, విద్యార్థులు కనీసం అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

### అన్నసత్రం అదనపు గదికి భూమిపూజ

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆవరణలో నిత్య అన్నదాన సత్రానికి అదనపు వసతి నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. దాతలు చిలుక సురేందర్ రెడ్డి–పావని, సూరమ్ రాజమహేంద్ర రెడ్డి–సునీత దంపతులు దేవస్థానం ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి, నవీన్ స్వాములు, దేవస్థాన శాశ్వత సభ్యులు కోర్త చంద్రా రెడ్డి, దెంది కృష్ణావ రెడ్డి, చెన్న కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### మహిళా బిల్లును అడ్డుకోవడం సిగ్గుచేటు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** పార్లమెంట్ లో ప్రవేశ పెట్టిన మహిళా బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకోవడం సిగ్గు చేటని మున్సిపల్ మాజీ కౌన్సిలర్, బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీదేవి ఆరోపించారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ మహిళలకు రాజకీయాలలో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన బిల్లును అడ్డుకున్న ఎంఐఎం, కమ్యూనిస్టులు, బీఆర్ఎస్ పార్టీలకు తెలంగాణ మహిళా లోకం సరైన సమయంలో తగిన బుద్ధి చెబుతుం దన్నారు.

**బిల్లును వ్యతిరేకించడం దుర్మార్గం**

**ముద్ర, తాండూర్:** మహిళా బిల్లును వ్యతిరేకించిన కాంగ్రెస్ పార్టీకి దేశంలోని మహిళల పట్ల ఉన్న చిత్తశుద్ధి ఎలా ఉందో గ్రహించాలని తాండూర్ పట్టణ బిజెపి కౌన్సిలర్లు అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో శనివారం బిజెపి కౌన్సిలర్లు నాగారం మల్లేశం అంతారం కిరణ్ శ్రీకాంత్ రెడ్డి నల్ల బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు.

### 30న ఉచిత కంటి చికిత్స శిబిరం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30న ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా ఆప్తాలమిక్ అధికారి కొ్ట్ర బాలాజీ తెలిపారు. పట్టణంలోని పాత కలెక్టరేట్ భవనంలో గది నెంబర్ 102లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందన్నారు. కాటరాక్ట్ సమస్య ఉన్న రోగులకు ఆపరేషన్లు ఏనుగొండలోని లయన్ రామ్ రెడ్డి కంటి ఆసుపత్రిలో నిర్వహించ నున్నట్లు తెలిపారు.

# జనగణన వివరాలు గోప్యంగా ఉంచాలి

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** జనగణన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. శనివారం మల్దకల్ మండల కేంద్రంలోని జడ్పీ హెచ్ఎస్ లో గణనకు సంబంధించి సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సందర్శించి మాట్లాడారు. ఈ విధులు నిర్వహించే వారందరూ బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో పనిచేయాలని సూచించారు. జన గణనలో సేకరించే సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు వెళ్లకుండా చూడాలని ఆదేశించారు. ఇండ్ల గణనకు సంబంధించి తప్పులు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఇండ్ల గణన పూర్తయితే వచ్చే ఏడాది జనాభా గణన చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన బ్లాక్‌పై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని, మ్యాప్ తయారీకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సరైన మ్యాప్ ఉంటే సగం పని పూర్తయినట్లేనని తెలిపారు. ఇళ్ల లెక్కింపు (హౌస్ లిస్టింగ్) అత్యంత



జాగ్రత్తగా చేయాలని, ఒక్క తప్పు కూడా ఉండకూడదన్నారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియను ఎక్కువగా ప్రోత్సహించాలని, ఈ విషయాన్ని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఆశ, అంగన్వాడి కార్యకర్తలకు తెలియజేయాలన్నారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు జరిగే ఇండ్ల గణన ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్ల పనిని చార్జ్ అధికారులు సమీక్షిస్తూ, మార్గనిర్దేశం చేయాలని, ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించాలన్నారు. సెన్సస్ హ్యాండ్‌బుక్, గైడ్‌లైన్స్ ప్రకారం పనులు నిర్వహించాలని ఆదేశించారు. గణనకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే శిక్షకులను అడిగి ఇప్పుడే పరిష్కరించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయ పాలనతో, పారదర్శకంగా, నిబద్ధతతో పనిచేస్తే సెన్సస్ విజయవంతంగా పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మల్దకల్ మండల తహసిల్దార్ ఝాన్సీ, ఎంపీడీవో ఆంజనేయులు, ఎంఈఓ సురేష్, శిక్షకులు నరేష్, రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

**పకడ్బందీగా నిర్వహించాలి**

**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ మున్సిపల్ కార్యాలయంలో మే 11 నుండి జరిగే కుల గణన పకడ్బందీగా నిర్వహించాలని తాండూర్ మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి కోరారు. తాండూర్ మున్సిపల్ కార్యాలయంలోని మున్సిపల్ మీటింగ్ హాల్లో శనివారం జనాభా గణన ఎన్యూమారేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సూపర్వైజర్లు తమ తమ పరిధిలో ఎప్పటికప్పుడు పరిశీలించి తప్పులు జరగకుండా చూడాలని కోరారు. జనాభా గణాలకు సంబంధించిన మార్గదర్శకాలను అందరూ తప్పక చదివి మార్గదర్శకాలు అనుగుణంగా ఇండ్ల చేపట్టాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మేనేజర్ నరేందర్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్లు అనిల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### వడదెబ్బ రోగులకు ప్రత్యేక బెడ్లు



**ముద్ర ప్రతినిధి నాగర్ కర్నూల్:** ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నాగర్ కర్నూల్ ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో వడదెబ్బ (హీట్ స్ట్రోక్) బాధితుల కోసం ప్రత్యేక బెడ్లు ఏర్పాటు చేసినట్లు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఉషారాణి తెలిపారు. వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండి వడదెబ్బ బాధితులకు తక్షణ సేవలు అందించనున్నారని తెలిపారు. ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ బి. సూర్యనారాయణ ఆధ్వర్యంలో వైద్య బృందం ప్రత్యేక చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండే మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండటం మంచిదని, వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే ఆసుపత్రిని సంప్రదించాలని సూచించారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:** ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తుందని, లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. గట్టు మండలం చమన్ ఖాన్ దొడ్డి గ్రామంలో శనివారం ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న పలువురు లబ్ధిదారుల నూతన గృహాలను రిబ్బన్ కట్ చేసి ముఖ్య అతిథులు ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు ఒకేసారి గృహ ప్రవేశాలు చేసుకోవడం సంతోషంగా ఉందని, మరో విడతలో ఇండ్లు లేని వారికి కూడా గృహాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. తెలంగాణ లైవ్లీ హుడ్ ఇంక్లూజివ్ ప్రోగ్రాంకు గట్టు మండలం ఎంపికవడంతో అత్యంత వెనుకబడ్డ 15 గ్రామాలను ఎంపిక చేసి, ఒక్కో గ్రామంలో




25 కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగు పరిచేందుకు సమన్వయకర్తల సహకారంతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐక్యమత్యంగా ఉంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అంతకు ముందు ఎల్బీఎం, భవిష్య భారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన డిజిటల్ సేవల భవనాన్ని ప్రారంభించారు. మార్కెట్ చైర్మన్ హనుమంతు, సర్పంచ్ భీమయ్య, ఉప సర్పంచ్ రేణుక, హౌసింగ్ డీఈ కాశీనాథ్, అధికారులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీల్లో అన్నిరకాల వైద్య సేవలందించాలి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మాతా శిశు సంరక్షణ, గర్భవతులకు అన్ని రకాల సేవలను అందించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణ, గర్భవతులకు అన్ని రకాల సేవలను అందిస్తూ వాటి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. జిల్లా పరిధిలో అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహణ 62 శాతం మాత్రమే ఉందని దీనిని 100 శాతం సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు. టి.బి వ్యాధిగ్రస్తుల స్క్రీనింగ్ పరీక్షలు, నిర్ధారణ వివరాలు నిశ్చయ్ ఆన్లైన్ పోర్టల్ లో నమోదు చేయాలని తెలిపారు. జిల్లా పరిధిలో 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయసు ఉన్న అమ్మాయిలకు సర్వైకల్ క్యాన్సర్ రాకుండా




నిరోధించడం కోసం ప్రత్యేక డ్రైవ్ ద్వారా హెచ్పివి వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నప్పటికీ నిర్దేశిత లక్ష్యం మేరకు వ్యాక్సినేషన్ జరగకపోవడం వలన జిల్లా విద్యాశాఖ అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ రీజినల్ కోఆర్డినేటర్లతో సమన్వయం చేసుకొని విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. స్వర్ణ కుమారి జెడ్పీ సీఈఓ సుధీర్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రాజ్యలక్ష్మి , కొడంగల్ ఆస్పత్రి సూపరిండెంట్ మాలతి, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

## 20 నుంచి సంక్షేమ వారోత్సవాలు

**కలెక్టర్ బాదావత్ సంతోష్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్న "సంక్షేమ వారోత్సవాలు"ను జిల్లాలో సమగ్రంగా, ప్రజలకు చేరువగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సెక్రటేరియట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ బాదావత్ సంతోష్ అదనపు కలెక్టర్లు అమరేందర్, జీవీ శ్యామ్ ప్రసాద్



లాల్‌తో కలిసి హాజరయ్యారు. సంక్షేమ వారోత్సవాల నిర్వహణకు ముందుగానే విస్తృత ప్రణాళికలు రూపొందించి అన్ని శాఖలను సమన్వయం చేసినట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి బాధ్యతలను స్పష్టంగా కేటాయించినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా సంక్షేమ శాఖల అధికారులు, డీఈఓ రమేష్ కుమార్, డిపిఓ శ్రీరాములు, పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు పాల్గొన్నారు.

## జిల్లాలో మరో పది ఇసుక రీచ్ ల ఏర్పాటు

**ముద్ర, నారాయణ పేట:** జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఇసుక రీచ్ లతో పాటు అదనంగా ఇసుక లభ్యత గల మరో పది రీచ్ లను ఏర్పాటు చేసి మన ఇసుక మన వాహనం ద్వారా రవాణాకు ఆన్ లైన్ అనుమతులు ఇవ్వాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శనివారం కలెక్టరేట్లో డి.ఎల్.ఎస్.సి సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వర్కూరు పరిధిలోని నాలుగు రీచ్ తో పాటు ఉట్కూర్ మండలంలోనీ నాగిరెడ్డి పల్లి రీచ్ ల నుంచి ఇసుకను తరలించేందుకు ఆన్లైన్ అనుమతులు జారీ చేస్తున్నామని, ఇకపై జిల్లాలో గుర్తించిన మరో పది ఇసుక రీచ్ ల నుంచి కూడా రవాణాను ఆన్ లైన్ అనుమతులు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆయా రీచ్ లకు కే ఏంఎల్ మ్యాపింగ్ చేసి రెవెన్యూ, మైనింగ్, భూగర్భ జల వనరుల శాఖ, నీటి పారుదల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి పది రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అలాగే అమ్మి కుంట, నేరేడు గాం, సంగం బండ, మిశ్రిఫా, రాకొండ( చెక్



డ్యాం) పరిధిలోనూ ఇసుక లభ్యత, రవాణా పై అధికారులు పరిశీలన చేయాలన్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో మన రాష్ట్ర పరిధి ముగింపు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇదే నెలలో మరోసారి నిర్వహించే డీ ఎల్ ఎస్ సీ సమావేశంలో పది రీచ్ ల నుంచి ఇసుక రవాణాకు అనుమతులు ఇవ్వాలని కమిటీ నిర్ణయించింది.

## అభివృద్ధికి నిధులు కేటాయించండి



**ముద్ర, మల్కాజిగిరి:** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం నిధులు అందజేయాలని మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మాను చౌదరికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాజీ మున్సిపల్ కార్పొరేటర్లతో కలిసి శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై సమగ్రంగా చర్చించారు. రిజిస్ట్రేషన్ చట్టం 1908లోని సెక్షన్ 22-A కింద ఉన్న నిషేధిత ఆస్తుల జాబితాను పునఃసమీక్షించి, వక్ఫ్ బోర్డు పేరుతో తప్పుగా నమోదైన లీగల్ హౌస్ ప్రాపర్టీలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని, మల్కాజ్‌గిరిలో ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. సఫిల్‌గూడలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని. అల్వాల్‌లో అగ్నిమాపక కేంద్రం కోసం కేటాయించిన గ్రామకంఠం ప్రభుత్వ భూమిని రక్షించాలి. మల్కాజ్ గిరి నియోజకవర్గంలో నిర్మాణంలో నిలిచిపోయిన కమ్యూనిటీ హాళ్లను పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, మల్కాజ్‌గిరి కాలనీల సంక్షేమ సంఘాల సమాఖ్య జనరల్ సెక్రెటరీ బి.టి. శ్రీనివాస్, పాల్గొన్నారు.

## నవోదయ విద్యార్థుల ప్రతిభ



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** సీబీఎ స్ఈ 10వ తరగతి పరీక్షా ఫలితాలలో వట్టెం జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలాజీ నాయక్ తెలిపారు. ఈ ఫలితాలలో కొల్ల సింధూజ రాణి 97.20 శాతం (486/500) మార్కులతో మొదటి స్థానం సాధించగా, నీలి లిఖిత 96.80 శాతం (484/500) మార్కులతో రెండో స్థానం, రసుమొల్ల హేమంత్ 96.40 శాతం (482/500) మార్కులతో మూడో స్థానం సాధించారు. అలాగే 80 శాతం పైగా విద్యార్థులు డిస్టింక్షన్ మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

## తీన్మార్ మల్లన్న చిత్రపటానికి క్షీరాభిషేకం



**ముద్ర, కాప్రా:** తెలంగాణ రాజ్యాధికార పార్టీ మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు పనగట్ల చక్రపాని గౌడ్, జిల్లా యూత్ అధ్యక్షులు సింగం అరుణ్ పటేల్, మహిళా విభాగం అధ్యక్షురాలు నీరుడు షాలినితో కలిసి సైనిక్ పురి చౌరస్తా వద్ద తీన్మార్ మల్లన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పనగట్ల చక్రపాణి గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో తీన్మార్ మల్లన్న పోరాటంతో రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేసిందని, చేసిన కులగణన రిపోర్టులో కులాల వారిగా తీసిన లెక్కలను ఇప్పటి వరకు ప్రజల ముందు బయటపెట్టకపోవడం సిగ్గుచేటని వారన్నారు. అందుకే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పలు మార్లు ప్రభుత్వాన్ని కులగణన రిపోర్టు బయట పెట్టాలని వివిధ మాధ్యమాల ద్వారా, శాసన మండలి లో ప్రభుత్వాన్ని నిలదీస్తూ ప్రభుత్వాని మెడలు వంచి నేడు కులగనన రిపోర్ట్ ని బయట పెట్టి పబ్లిక్ డొమైన్ లో పెట్టేవరకు కొట్లాడి ఉద్యమించిన ఏకైక నాయకుడు తీన్మార్ మల్లన్న అని వారు అన్నారు. రానున్న రోజులలో ఆయన నాయకత్వంలో బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు

## జిల్లాలో ఐదు మొక్కజొన్న కేంద్రాల ఏర్పాటు

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జిల్లాలో ఐదు మొక్కజొన్న కేంద్రాలను ప్రారంభించేందుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ తహిమినా తెలిపారు. రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక చొరవతో వ్యవసాయ సహకార మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలోని పీఏసీఎస్ ధారూర్, పీఏసీఎస్ పూడూర్, డీసీఎంఎస్ వికారాబాద్, డీసీఎంఎస్ తాండూర్, డీసీఎంఎస్ పరిగి మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. ధారూర్, పూడూరు , తాండూర్ లలో ఇప్పటికే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. మొక్కజొన్న కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2400 గా ఉందని ఆర్థిక, గణాంకాల శాఖ ఇచ్చిన అంచనాల ప్రకారం ఎకరానికి 26.50 క్వింటాళ్లను పరిగణనలోకి తీసుకుని కొనుగోలు జరుగుతోందని తెలిపారు.

## మొక్కజొన్న కొనుగోళ్లపై రైతుల ఆందోళన

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్ :** జిల్లాలో మొక్కజొన్న కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం నెల్లికొండ చౌరస్తా వద్ద శ్రీశైలం రోడ్డు పై రైతులు ధర్నా నిర్వహించి తమ నిరసన తెలిపారు. నాలుగు రోజులుగా గన్నీ బ్యాగులు సరఫరా చేయకపోవడంతో కొనుగోలు ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. తూకం వేసిన మొక్కజొన్న బస్తాలను కూడా సమయానికి తరలించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో నిల్వలో ఉన్న పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే లారీలు ఏర్పాటు చేసి కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారులను డిమాండ్ చేశారు. ధర్నాతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.




## అక్రమ నిర్మాణాలపై కమిషనర్ కు ఫిర్యాదు



**ముద్ర, తాండూర్:** తాండూర్ మున్సిపల్ పరిధిలో సర్వే నంబర్ 130లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇర్షాద్ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే పీడీ యా కింద కేసులు నమోదు చేసి జైలుకు పంపించాలన్నారు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక ఉన్న అసలు దోషులను బయటపెడతామని, ఎవరి ప్రమేయం ఉన్నా ప్రజల ముందు నిలబెడతామని అన్నారు. అధికారుల సహకారం ఉన్నట్లు తేలితే వారిపైనా చర్యలు తీసుకునేలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం అని స్పష్టం చేశారు.

## సెమిస్టర్ పరీక్షల తనిఖీలు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్ :** పాలమూరు యూనివర్సిటీ పరిధిలో జరుగుతున్న సెమిస్టర్ పరీక్షల సంద ర్భంగా పరీక్షల నిర్వహణపై పర్యవేక్షణ ను కట్టుదిట్టం చేశారు. యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కే ప్రవీణ శుక్రవారం విశ్వ వికాస్ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు, శ్యాముందర్ నేతృత్వంలోని సెట్టింగ్ స్క్వాడ్ కూడా తనిఖీల్లో పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలతోనే ఉజ్వల భవిష్యత్తు

**ముద్ర, కూకట్‌పల్లి:** అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని, ఆశయ సాధనను స్ఫూర్తిగా తీసుకుని యువత జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థులకు అంబేద్కర్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. స్థానిక దళిత సంఘాల ప్రతినిధులు, రాజకీయ నాయకులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**మద్యం బంద్:**

కొత్త అలవాట్లు పెంచుకోండి
– వ్యాయామం, పుస్తకాలు, హాబీలు మీ దృష్టిని మళ్లిస్తాయి
– ఖాళీ సమయం తగ్గిస్తే తాగాలనే ఆలోచన కూడా తగ్గుతుంది



# ప్రజల ముంగిట్లోకి న్యాయ సేవలు

### - హైకోర్టు న్యాయమూర్తి రేణుక




**కోరుట్ల, ముద్ర:**
ప్రజల ముంగిట్లోకి న్యాయ సేవలం దించేందుకు అదనపు కోర్టులు ప్రారంభిస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి రేణుక తెలిపారు. పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి, జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు సముదాయంలో శనివారం మొదటి తరగతి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టును హైకోర్టు న్యాయమూర్తి ప్రారంభించారు. కోరుట్ల కోర్టుకు వచ్చిన న్యాయమూర్తికి సర్వమత పెద్దల సమక్షంలో స్వాగతం పలికారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో న్యాయమూర్తి మాట్లాడాతూ కోరుట్లలో అదనపు కోర్టు ప్రారంభించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి రత్న పద్మావతి, అడిషనల్ జిల్లా న్యాయమూర్తి సునీత రవీందర్‌రెడ్డి, మెట్‌పల్లి సబ్ కోర్టు జడ్జి నాగేశ్వరరావు, జగిత్యాల సబ్ కోర్టు జడ్జి వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ, కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి పావనీ, మెట్‌పల్లి సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి అరుణ్ కుమార్, మెట్‌పల్లి డీఎస్పీ రాములు, కోరుట్ల, మెట్ పల్లి సర్కిల్ ఇన్ స్పెక్టర్ లు సురేష్ బాబు, అనిల్ కుమార్, సబ్ ఇన్ స్పెక్టర్ చిరంజీవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట ఆంజనేయులు, సీనియర్ న్యాయవాదులు ముబీన్ పాషా, చెన్న విశ్వనాథం, బోయిని సత్యం, అబ్దుల్ హఫీజ్, ఏపీజీ గోనె రాజేష్ ఖన్నా, బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

**సీనియర్ సివిల్ జడ్జికి సన్మానం..**

భారత న్యాయవ్యవస్థలో అత్యున్నత స్థాయి పరిశోధన, వృత్తిపరమైన ప్రతిభను కనబరిచిన మెట్ పల్లి సీనియర్ సివిల్ జడ్జి నాగేశ్వర్ రావును హైకోర్టు న్యాయమూర్తి రేణుక సన్మానించారు. పోలీసు దర్యాప్తులో పాటిం చాల్సిన చట్టబద్ధమైన విధానాలు, రక్షణలపై నాగేశ్వర్ రావు చేసిన పరిశోధనలను ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయన్నారు. నాగే శ్వర్ రావు అందించిన మార్గదర్శకాలు దర్యాప్తు సంస్థలకు, యువ న్యాయ మూర్తులకు దిక్సూచిగా నిలుస్తాయని పేర్కొన్నారు. జిల్లా న్యాయమూర్తి రత్నాపద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక దశ నుంచే గణితంపై అవగాహన కల్పించాలి



**ముద్ర, కరీంనగర్ :** విద్యార్థులకు ప్రాథమిక దశ నుంచే గణిత శాస్త్రంపై అవగాహన కల్పించాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి సూచించారు. శనివారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ లో ఇటీవల యూనిఫైడ్ కౌన్సిల్ నిర్వహించిన అంతర్జాతీయ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ లో విజేతలుగా నిలిచిన పాఠశాల విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఒలింపియాడ్ లో తమ పాఠశాలకు చెందిన జతిన్ సిద్దార్థ, డి.సిన్దశ్రీ, క్రిషిక్ ప్రీన్స్, నడిపెల్లి సహర్ష్, శివ స్మరణ్ రెడ్డి లు విజేతలుగా నిలిచినట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అద్భుత విజయాలను నమోదు చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



**మహదేవపూర్, ముద్ర:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఈ నెల 23న నిర్వహించే ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను శనివారం కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సంకీర్త్ పరిశీలించారు. సభా స్థలం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, సభా వేదికను క్షుణ్ణంగా పరిశీలించారు. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు, వేదిక సాంకేతిక వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్కింగ్ సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అవసరమైతే అదనపు స్థలాన్ని చదును చేసి వాహనాల నిలుపుదల సౌకర్యాన్ని విస్తరించాలని సూచించారు. హెలిప్యాడ్ స్థలంలో దుమ్ము లేకుండా చూడాలని ఆదేశాలిచ్చారు .ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి , ఆర్ అండ్ బీ ఈఈ రమేష్, డిఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు తదితర అధికారులు పాల్గొన్నారు.

## బ్యారేజీని సందర్శించిన సీఎంఓ బృందం



**మహాదేవపూర్, ముద్ర:**
మేడిగడ్డ బ్యారేజీని శనివారం సీఎంఓ బృందంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 20న మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఫిల్లర్లను పరిశీలించడానికి రానుండటంతో అక్కడి పరిస్థితిని పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాశ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కటకం అశోక్, పలిమెల సర్పంచ్ జవ్వాజి పుష్పలత తిరుపతి, బ్లాక్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ అస్రార్ ఖురేషి తదితరు నాయకులు సందర్శించారు.

# అర్హులైన జర్నలిస్టులకే అక్రిడిటేషన్లు

### - నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలో నిబద్ధతతో పనిచేస్తున్న నిజమైన జర్నలిస్టు లందరికీ ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని కలెక్టర్ అభిలాష అభినవ్ స్పష్టం చేశారు. నూతనంగా ఏర్పాటైన జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ల జారీ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని సూచించారు. అర్హత గల ప్రతి విలేకరికి కార్డు అందేలా చూడాల్సిన బాధ్యత జిల్లా పౌర సంబంధాల అధికారి, కమిటీ సభ్యులపై ఉందన్నారు. అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన జీవోలోని మార్గదర్శకాలను వివరించారు. ముఖ్యంగా క్రిమినల్ నేపథ్యం ఉన్న వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బందికి కార్డులు జారీ చేయకూడదని ఆమె ఆదేశించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. త్వరలోనే జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ పూర్తి స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఇ. విష్ణువర్ధన్, కమిటీ సభ్యులు అల్వాల హనుమంతు, కొండూరి రవీందర్, అల్లం అశోక్, ఆర్. మహేందర్, ఎం.ఏ. వసీం, రామెల్ల రాజేశ్వర్, సిరిపురం నాగరాజు, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకి షర్మిల హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్మల్ లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ మైనర్ డ్రైవింగ్ చేస్తున్న వారికి ఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడపడం చట్ట విరుద్ధమే కాకుండా ప్రాణాపాయకర చర్య అని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. చిన్నపిల్లలు డ్రైవింగ్ చేయడం వల్ల జరిగే చాలా తీవ్రమైన ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అలాంటి ఘటనల్లో ప్రాణ నష్టం, శాశ్వత గాయాలు కలగవచ్చని వివరించారు. వేగ పరిమితులు పాటించడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం వంటి ప్రాథమిక రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయన్నారు. మైనర్ డ్రైవింగ్ కేసుల్లో తల్లితండ్రులదే బాధ్యత అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఇన్ స్పెక్టర్ సమ్మయ్య, ఆర్ఐ రామ్ నిరంజన్ రావు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, మైనర్ల తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అతిథి ఆకలి తీర్చడం సనాతన ధర్మం




**కోరుట్ల, ముద్ర:**
ఆకలితో వచ్చిన అతిథి ఆకలిని తీర్చే సంతృప్తి పరచడం మన సనాతన ధర్మమని శృంగేరి శారదాపీఠ ఆస్థాన పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వరశర్మ పేర్కొన్నారు. పట్టణంలోని వాసవి కళ్యాణ భవనంలో సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న అష్టాదశ మహాపురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞంలో భాగంగా శనివారం శ్రీ వరాహ మహాపురాణ సప్తాహం ఆరో రోజు ప్రవచనం జరిగింది. మొదట సమితి ప్రసాద కార్యదర్శి మంచాల రాజలింగం పద్మ దంపతులు, కొత్త హనుమయ్య శోభ రాణి దంపతులు గురు వందనం చేశారు. దుర్వాస మహర్షి కోపము, శక్తి తెలిసినప్పటికీ ఒక మామూలు వేటగాడు అచంచల భక్తితో అతిథి మర్యాదలు చేసి మోక్షం పొందిన ఇతివృత్తం ప్రవచనంలో భాగంగా మహేశ్వరశర్మ వివరించారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు మంచాల జగన్, ప్రధాన కార్యదర్శి బట్టు హరికృష్ణ, కోశాధికారి రేగుంట రాజారాం, పురాణ కమిటీ చైర్మన్, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# జన గణనను పకడ్బందీగా నిర్వహించాలి

### - జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
త్వరలో నిర్వహించే జన గణనను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. ఈ కార్యక్రమ నిర్వహణ కోసం ఎంపికైన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు శనివారం జిల్లా కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. జనగణన ప్రక్రియ దేవాభివృద్ధికి కీలకమని తెలిపారు. ఖచ్చితమైన గణాంకాలు సేకరించడం ద్వారా ప్రభుత్వ పథకాల రూపకల్పన, అమలు సులభమవుతుందని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. శిక్షణలో భాగంగా ఇంటింటి వివరాల సేకరణ విధానం, డిజిటల్ పద్ధతుల్లో డేటా నమోదు, ప్రజలతో వ్యవహరించే తీరు, గోప్యత పరిరక్షణ వంటి అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. అలాగే ఫీల్డ్ లో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారాలపై మార్గదర్శకాలు అందించారు. జిల్లాలో జనగణన ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని చెప్పారు. ప్రతి ఇంటి సమాచారం సరిగ్గా నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజల సహకారం లేకుండా జనగణన సాధ్యం కాదన్నారు. జగిత్యాల మున్సిపల్ కమిషనర్ స్పందన, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకీమ్ పా ల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు పాటించాలి



**కోరుట్ల, ముద్ర:** వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలని కోరుట్ల ఎస్సై చిరంజీవి పేర్కొన్నారు. పట్టణంలో శనివారం అరైవ్ –అలైవ్ కార్యక్రమంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆటో డ్రైవర్లు, యువకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇటీవల జరిగిన పలు రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం డ్రైవర్ల నిర్లక్ష్యమేనని తెలిపారు.

# ఇండియా కూటమి దిష్టిబొమ్మ దహనం



**కోరుట్ల, ముద్ర:**
బీజేపీ జిల్లా శాఖ పిలుపు మేరకు శనివారం కథలాపూర్ లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు మల్యాల మారుతి ఆధ్వర్యంలో మహిళా బిల్లును వ్యతిరేకించిన ఇండియా కూటమి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ లో మహిళా బిల్లును ఇండియా కూటమి నాయకులు వ్యతిరేకించడం బాధాకరమన్నారు. ఇండియా కూటమి నాయకులు మహిళల పట్ల వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాచమడుగు వెంక టేశ్వరావు, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కథలా పూర్ మహేష్, మండల ప్రధాన కార్యదర్శి నరెడ్ల రవి, సీనియర్ నాయకులు బద్రి సత్యం, కాసోజీ ప్రతాప్, వొడ్డాటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బంద్

మంచి సపోర్ట్ సిస్టమ్ కలిగి ఉండండి– కుటుంబం, స్నేహితుల సహాయం తీసుకోండి– మీ లక్ష్యాన్ని వారికి చెప్పి ప్రోత్సాహం పొందండి






## అయోమయంలో ఉపాధి కార్మికులు: వ్యకాసం

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ఐదు వారాలు పనిచేసినా రోజుకు ఎంత కూలీ వస్తుందో తెలియని అయోమయంలో ఉపాధి హామీ కార్మికులు ఉన్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహా ఆవేదన చేశారు. శనివారం తుర్కపల్లి మండలం ముల్కలపల్లి లోని ఉపాధి హామీ పని ప్రదేశాన్ని సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. మోడీ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన కొత్త చట్టంలో కార్మికులకు తీరని నష్టం జరుగుతోందని అన్నారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పోతరాజు జహంగీర్, సిఐటియు మండల కన్వీనర్ తూటి వెంకటేశం, రైతు సంఘం జిల్లా నాయకులు కొక్కొండ లింగయ్య, సిఐటియు జిల్లా నాయకులు గడ్డమీది నరసింహ, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలో గర్భిణులకు సీమంతాలు




**తుర్కపల్లి, ముద్ర:** తుర్కపల్లి మండల కేంద్రంలోని ఒకటి రెండు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం గర్భిణీలకు సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ స్వరాజ్యం, సూపర్వైజర్ నాజీ మునిఫా, అంగన్వాడీ టీచర్లు పుట్ట సునీత, తోట భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి



**ముద్ర, హుజూర్ నగర్:** పట్టణంలోని గోవిందాపురంలో ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు 8వ వార్డ్ కౌన్సిలర్ కోల ఉదయభాను తెలిపారు. శనివారం హుజూర్ నగర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సరైన వేదిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర నీటిపారుల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో హుజూర్నగర్ ప్రాంతాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరు కలిసి రావాలన్నారు. ముఖ్యంగా పట్టణంలోని గోవిందాపురంలో 8వ వార్డులోని ప్రధాన సమస్యల పరిష్కారానికి సహాయ సహకారాలు అందించాలని మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లికార్జునరావు మరియు కమిషనర్ శ్రీనివాసరావును కోరారు. ఎనిమిదో వార్డులో ప్రధానంగా గోవిందాపురం స్మశాన వాటిక బ్రిడ్జి నిర్మాణ పనులు, సిసి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. వేసవిలో నీటి ఎద్దడి రాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

## నేడు ఐజేయు ఆధ్వర్యంలో వైద్య శిబిరం

**ముద్ర ప్రతినిధి, మహబూబాబాద్:** ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని లయన్స్ క్లబ్ లో జర్నలిస్ట్ లకు, వారి కుటుంబ సభ్యులకు, మిత్రులకు టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్, జిల్లా ప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం అయ్యే ఈ.. ఉచితవైద్యశిబిరాన్ని విజయ్ గ్యాస్ట్రో అండ్ లివర్ క్లినిక్ వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు, ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజీస్ట్ డాక్టర్ విజయ్ రాంపల్లి తోపాటు పలువురు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు. ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా లివర్ పనితీరు, కొవ్వు శాతం, భవిష్యత్తు ప్రమాదాలను తెలిపే సుమారు రూ.7వేల విలువైన ఫైబ్రోస్కాన్ పరీక్షను ఈ శిబిరంలో పూర్తి ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఫైబ్రోస్కాన్ పరీక్ష చేయించుకునేవారు, పరీక్షకు నాలుగు గంటల ముందు నుంచి ఏమి తినకుండా ఉండాలని వైద్యులు సూచించారు.

## భవిష్యత్ ఆశాకిరణం కవిత




**ముద్ర, తుంగతుర్తి:** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించే ఆశాకిరణం కవితక్క మాత్రమేనని, బలమైన ప్రజా ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరిపై పోరాటాలు జరుపుతామని తెలంగాణ జాగృతి స్టీరింగ్ కమిటీ సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్ అన్నారు. శనివారం తుంగతుర్తి నియోజకవర్గ తిరుమలగిరి మండల కేంద్రంలో కవిత పెట్టబోయే కొత్త పార్టీ ఆవిర్భావ సభ ప్రచారంలో భాగంగా వివిధ మండలాల్లో పోస్టర్ ఆవిష్కరణలు చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఆవిర్భావ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించాలని సూచించారు. సామాజిక తెలంగాణ సాధించుకునే వరకు పోరాడుతామని కవితక్క నేతృత్వంలో ప్రభుత్వ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా జాగృతి శ్రేణులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధ్యక్షురాలు ఎస్ కృష్ణవేణి, రాష్ట్ర నాయకులు మందడి సోమిరెడ్డి, మండలాల మండల, జిల్లా నాయకులు జి శ్యామ్ నాయక్, ఎన్ చిరంజీవి, పి.మహేష్, విప్లవ కుమార్, మహేశ్వరి, సైదమ్మ, జ్యోతి పాల్గొన్నారు.

# నల్ల బ్యాడ్జిలతో బీజేపీ నిరసన




**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** బిజెపి జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో శనివారం స్థానిక వినాయక చౌరస్తా వద్ద మహిళా రిజర్వేషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన ఇండియా కూటమి పార్టీలపై నల్ల బ్యాడ్జిలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు మాధురి చంద్ర మాట్లాడుతూ మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే నారీశక్తి వందన్ అధినియం మహిళల సాధికారతకు ఎంతో కీలకమని తెలిపారు. దేశవ్యాప్తంగా మహిళలకు రాజకీయంగా సమాన అవకాశాలు కల్పించడానికి ఈ చట్టం ఒక చారిత్రాత్మక అడుగని పేర్కొన్నారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన ఇండియా కూటమి పార్టీలు మహిళల అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయని తీవ్రంగా విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై కాలయాపన చేస్తూ మహిళా ఓట్లను ఆర్జిస్తూ గద్దెనెక్కాలని చూస్తే సహించబోమని తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ వంగేటి సుచరిత రెడ్డి, బండారు స్వర్ణలత, తుమ్మల యాస్మిన్, మహిళా మోర్చా నాయకులు బూరుగు రాణి, లక్కాకుల మాధవి, గుంటిపల్లి మహేశ్వరి, చామకూరి చిత్రలేఖ, ఎంజాల మల్లికా, కిసాన్ మోర్చా నాయకులు పడమటి జగన్ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేందర్ గుప్తా, జిల్లా కార్యదర్శి మేడి కోటేష్, తడిసిన మల్లారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబెర్ కోళ్ల బిక్షపతి, సుర్వి శ్రీను, జిల్లా కార్యాలయ కార్యదర్శి మంగు నర్సింహారావు, ఎండీ.మహ్మమోద్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఉడుత భాస్కర్, పట్టణ ఉపాధ్యక్షులు కొల్లూజు శ్రవణ్, కనుకుంట్ల రమేష్,కొలిచేలిమి మల్లికార్జున్, ఉష కిరణ్, సత్యం, రాజు, తుమ్మల నగేష్, ఎరపుల శివ పాల్గొన్నారు.

# ఖచ్చితమైన ఫలితాలు అందించాలి : కలెక్టర్



**ముద్ర, సూర్యాపేట:** టీ హబ్ సేవల గురించి సూర్యాపేట కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ.. టీ హబ్ లో మెరుగైన, నాణ్యమైన రక్త పరీక్షల నిర్వహణ, ఖచ్చితమైన ఫలితాలు సమాయనుసారం రావటం, నివేదికలు అందజేయటం కోసం పర్యవేక్షించాలని సూచించారు. జీజీహెచ్ సూర్యాపేట, ఏహెచ్ కోదాడ, పిహెచ్‌సి నేరేడుచెర్ల, పిహెచ్‌సి గరిడేపల్లి ప్రాంతాల పరిధిలో సేకరించిన రక్త నమూనాలు ఎక్కువగా తిరస్కరణకు గురవుతున్నాయని, దీనికి గల కారణాల సమగ్ర నివేదిక సమర్పించాలని సూచించారు. మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ డా పెండెం వెంకటరమణ, డిసిహెచ్ఎస్ వెంకటేశ్వరరావు, ఇంచార్జ్ సూపరింటెండెంట్ డా శ్రీకాంత్ భట్, బయో కెమిస్ట్రీ, పెథోలోజీ, మైక్రోబయాలజీ విభాగాల అధిపతులు డా,, పావని కిరణ్మయి, పద్మావతి, తరుణ్, ప్రోగ్రాం అధికారి డా, జి ప్రసిద్ధ్, ఆసుపత్రి నిర్వాహకులు డా,, మనీషా, డి.పి.ఓ. ఉమా మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# జనగణన సమర్ధవంతంగా నిర్వహించాలి

- అదనపు కలెక్టర్ భాస్కరరావు




**ముద్ర, బీబీనగర్ :** జనగణన కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కరరావు సూచించారు. శనివారం జిల్లా పరిధి లోని బీబీనగర్ మండల కేంద్రంలో నిర్వహించిన జనగణన మొదటి దశ శిక్షణ తరగతిలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అధికారులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సుమారు 50 మంది ఎనుమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారని తెలిపారు. జనగణన కార్యక్రమాన్ని సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని అధికారులు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు శనివారం, సోమవారం, మంగళవారం రోజుల్లో కూడా కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీఓ, ఎంఈఓ, సంబధిత అధికారులు పాల్గొన్నారు.

# కదం తొక్కిన పోలీసులు

- సూర్యాపేటలో రోడ్డు భద్రతపై భారీ ర్యాలీ
- వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పీ నర్సింహా




**ముద్ర, సూర్యాపేట:** ప్రజలు వాహనదారులు రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం భాగస్వామ్యం కావాలని, సూర్యాపేట జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని ఎస్పీ నర్సింహా సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ, అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణ కేంద్రంలో పోలీసు సిబ్బంది హెల్మెట్ ధరించి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ బైక్ ర్యాలీ కోసం జిల్లా ఎస్పీ పోలీసు సిబ్బందికి అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత లోగో కలిగిన హెల్మెట్స్ పంపిణీ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ కోర్టు చౌరస్తా, పివిఎస్ఆర్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్, ఎంజీ రోడ్డు మీదుగా కొత్త బస్టాండ్ వరకు నిర్వహించారు. జిల్లా ఎస్పీ నర్సింహ అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, పోలీసు సిబ్బందితో కలిసి ర్యాలీని ముందుండి నడిపించారు. కొత్త బస్టాండ్ వద్ద మానవ హారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, శారీరక దారుఢ్యంలో భాగంగా పరేడ్ నిర్వహించారు. అనంతరం జిల్లా కేంద్రంలో భారీ రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించామని తెలిపారు. ప్రజలు వాహనదారులు పోలీసు వారి సూచనలు, రోడ్డు నియమ నిబంధనలు, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ డిఫెన్స్ డ్రైవింగ్ తో వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నిర్మూలించవచ్చని అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని, రాంగ్ రూటులో వాహనాలు నడపకూడదని, పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, ప్రయాణ సమయంలో హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వినియోగించకూడదని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర పోలీసు ప్రణాళిక మేరకు నిర్వహిస్తున్న ఈ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలకు స్పందించిన సూర్యాపేటకు చెందిన సెవెన్ స్టార్ సోలార్ ఎంటర్ప్రైజెస్ యజమాని మల్లేష్ పోలీస్ సిబ్బందికి హెల్మెట్స్ అందించారు. ఈ సందర్భంగా హెల్మెట్స్ అందించినందుకు గాను పోలీసుల సమక్షంలో మల్లేష్ ను ఎస్పీ సన్మానించారు. ఈ ర్యాలీ కార్యక్రమం నందు అదనపు ఎస్పీలు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరసింహాచారి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఆర్మడ్ రిజర్వ్ ఇన్స్పెక్టర్లు ప్రవీణ్, జానయ్య, ఆర్ఎస్ఐలు ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





## మిల్లర్లు ధాన్యం దిగుమతి చేసుకోవాలి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** ధాన్య కొనుగోళ్లు ముమ్మరం అవుతున్న సందర్భంగా, మిల్లర్లు వెంటనే ధాన్యం దిగుమతులు చేసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డిలు అన్నారు. ధాన్య కొనుగోళ్ల విషయమై వారు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ.. ధాన్య కొనుగోళ్లు ముమ్మరం అవుతుండగా మిల్లర్లు వెంటనే ధాన్యం దిగుమతులు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రోజా రాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజరు హరికృష్ణ, మిల్లర్లు పాల్గొన్నారు.



## ధాన్యం కేంద్రం ప్రారంభం

**ముద్ర, మోత్కూరు:** మండలంలోని దాచారం గ్రామంలో ఐకెపి ఆధ్వర్యంలో నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే మందుల సామెల్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లోనే ధాన్యాన్ని అమ్మి మద్దతు ధర పొందాలని అన్నారు. గ్రేడ్ ఏ రకం రూ.2389, బి రకం రూ.2369లు చెల్లిస్తారని అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ జ్యోతి ,ఆర్ ఐ సుమన్, జిపిఓ ఐలయ్య, గ్రామ సర్పంచ్ కర్నె జ్యోతి వీరేశం, ఉప సర్పంచ్ అవిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి సీఎం వినతితో..

## బయ్యారంలో చిగురిస్తున్న ఆశలు!

**ముద్ర ప్రతినిధి, మహబూబాబాద్:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్ డి కుమార స్వామి, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మలను శనివారం స్వయంగా కలిసి, మహబూబాబాద్ జిల్లా బయ్యారం లో గ్రీన్ స్టీల్ ప్లాంట్ (ఉక్కుపరిశ్రమ) ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పించి, విజ్ఞప్తి చేయడం మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా చర్చ కు తెర లేపింది. విభజన చట్టంలోనే బయ్యారంలో ఉక్కుపరిశ్రమ ఏర్పాటు చేయాలని అంశం ఉన్నప్పటికీ అది.. ఆచరణలో మాత్రం రోజురోజుకు అదృశ్యమయ్యే పరిస్థితి ఏర్పడింది. అలాంటి ఈ.. సమయంలో స్వయంగా రాష్ట్రముఖ్యమంత్రి కేంద్రం ఉక్కుశాఖ మంత్రిని కలిసి బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కోరడంతో.. మండువేసవిలో మహబూబాబాద్ జిల్లాప్రజల ఉక్కు పరిశ్రమ ఆశలు ఒక్కసారిగా చిగురించాయి. బయ్యారం లో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వైపు అడుగులు పడితే, అత్యంత ఎక్కువగా గిరిజన జనాభా కలిగిన మహబూబాబాద్ జిల్లాలో పారిశ్రామిక ప్రగతి ప్రారంభం అవుతుందని, వేలాదిమంది కి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుతాయని జిల్లావాసులు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఈ.. ప్రత్యేక సమావేశం మహబూబాబాద్ జిల్లా ప్రజలకు శుభవార్త గానే భావిస్తున్నారు.




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
19.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**మద్యం బంద్ : స్ట్రెస్‌ను హెల్తీగా హ్యాండిల్ చేయండి**

ధ్యానం, యోగా, నడక వంటి పద్ధతులు ఉపయోగించండి. స్ట్రెస్ వచ్చినప్పుడు మద్యం కాకుండా ఇతర మార్గాలు ఎంచుకోండి



# బీజేపీ ఎంపీని భర్తరఫ్ చేయాలి

- తెలంగాణ ఏర్పాటును భారత్-పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదు
- హిందుత్వం పేరుతో బీజేపీ నీచ రాజకీయాలు చేస్తోంది : : కాంగ్రెస్ నేతలు



**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట :**

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుపై మొదటి నుంచి బీజేపీ అవమానకరంగా వ్యవహరిస్తోందని, తాజాగా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలతో మరోసారి స్పష్టమైందని సిద్ధిపేట కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మండిపడ్డారు. సిద్ధిపేటలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద తెలంగాణ ఏర్పాటును భారత్‌పాకిస్థాన్ విభజనతో పోల్చిన తేజస్వీ సూర్య అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం అనేక మంది ప్రాణత్యాగాలు చేసి అమరులయ్యారని పేర్కొన్నారు. అందరి త్యాగాలను గుర్తించి సోనియాగాంధీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు జరిగిందని తెలిపారు. ఇలాంటి రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నాయకులు అవమానకరంగా మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానించిన తేజస్వీ సూర్యను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును భారతదేశంపాకిస్థాన్ విభజనతో పోల్చడం ప్రజలను అవమానించడమేనని అన్నారు. గతంలో ప్రధాని మోదీ తెలంగాణ ప్రజలను అవమానించారని, ఇప్పుడు బీజేపీ ఎంపీ చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ నైజాన్ని బయటపెడుతున్నాయని విమర్శించారు. తెలంగాణ నుంచి బీజేపీకి చెందిన మంత్రులు ఉన్నప్పటికీ, ఈ వ్యాఖ్యలను ఖండించకపోవడం దారుణమని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని, తెలంగాణ రాష్ట్రాన్ని అగౌరవపరిచేలా మాట్లాడటం తేజస్వీ సూర్య అజ్ఞానానికి నిదర్శనమని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాకే ఆనంద్, బొమ్మల యాదగిరి, ముద్దం లక్ష్మి, గయాజుద్దీన్, వహాబ్, రషద్, అర్షద్ హుస్సేన్, అజ్మత్, సంతోషి, పద్మా రెడ్డి, సనా, రజిని, అంజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## పుస్తకాలు జ్ఞాన భాండాగారాలు

- ప్రిన్సిపాల్ డా. సునీత

**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట :**

పుస్తకాలు జ్ఞాన భాండాగారాలని సిద్ధిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సునీత అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో భారీ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి. సునీత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "పుస్తకాలు జ్ఞాన భాండాగారాలు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రపంచ జ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి గ్రంథాలయాన్ని దేవాలయంగా భావించాలి" అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యార్థుల్లో పఠనాసక్తి పెంపొందించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి రోజుకు కనీసం ఒక గంట సమయాన్ని గ్రంథాలయంలో గడపాలని, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఆకాంక్షించారు. గ్రంథాలయ ఇన్‌చార్జి డా. మనోహర్ మాట్లాడుతూ, గ్రంథాలయ కమిటీ కన్వీనర్‌గా లైబ్రరీ విభాగాన్ని విద్యార్థులకు మరింత చేరువ చేయడమే లక్ష్యమని తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలతో పాటు సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం, సైన్స్‌కు సంబంధించిన అరుదైన గ్రంథాలను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అయోధ్య రెడ్డి, ఐక్యూఏసీ సమన్వయకర్త డా. మధుసూదన్, సీఓఈ డా. గోపాల సుదర్శనం, గ్రంథాలయ కమిటీ సభ్యులు, వివిధ విభాగాల అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని ప్రదర్శనలోని పుస్తకాలను ఆసక్తిగా వీక్షించారు. గ్రంథాలయ విభాగం చేసిన ఈ కృషితో కళాశాలలో పఠన సంస్కృతి మరింత బలపడుతుందని అధ్యాపకులు కొనియాడారు.

## దరువు జాతర వాల్ పోస్టర్ విడుదల

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



ఈనెల 20న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరగనున్న దరువు జాతర సందర్భంగా వాల్ పోస్టర్‌ను మెదక్ తెలంగాణ భవన్ వద్ద జిల్లా కళాకారులు విడుదల చేశారు. ఉద్యమ నిరుద్యోగ కళాకారుల మెదక్ జిల్లా అధ్యక్షుడు గుడాల సత్యనారాయణతో పాటు కళాకారులు నీరుడి సాయిలు, వరిగొంతం శేఖర్ చారి, అల్లారం పాపయ్య, దేవరాజు, చంద్రశేఖర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి ప్రారంభమై ఇప్పటి వరకు అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొన్న దరువు ఎల్లన్న, దరువు అంజన్న ఆధ్వర్యంలో దరువు వేదికను స్థాపించారని తెలిపారు. ఈ వేదిక స్థాపనకు 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా "వీరులారా వందనం - విద్యార్థి అమరులారా వందనం" పేరిట వీడియో పాటను కూడా విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఉద్యమకారులు, ఉద్యమ కళాకారులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ జాతరను విజయవంతం చేయాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

## డా. పి.చంద్రశేఖర్‌కు గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**



మెదక్ పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు డా. పిప్పిరి చంద్రశేఖర్ గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు-2026 అందుకున్నారు. ఆయన చేసిన విశిష్ట సేవలకు లభించిన గొప్ప గుర్తింపుగా ఈ అవార్డును పేర్కొన్నారు. జనరల్ సర్జన్‌గా అనేక ప్రాణాలను కాపాడుతూ, రోగులకు నూతన జీవం ప్రసాదించిన ఆయన సేవలు ప్రశంసనీయమని తెలిపారు. వైద్య వృత్తిని ఉద్యోగంగా కాకుండా సేవా ధర్మంగా భావించి అంకిత భావంతో పనిచేసినందుకు ఈ అవార్డు అందుకోవడం పట్ల కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. డా. పిప్పిరి చంద్రశేఖర్ లయన్స్ క్లబ్ వంటి సేవా సంస్థల్లో చురుకుగా పాల్గొంటూ అనేక సామాజిక కార్యక్రమాల్లో ముందుండి నడుస్తున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలను నిర్వహిస్తూ పేదల సంక్షేమం, ఆరోగ్య సేవలు, విద్యాభివృద్ధి వంటి అనేక రంగాల్లో తన వంతు సేవలను అందిస్తున్నారు.

## మున్సిపాలిటీలో కో-ఆప్షన్ నామినేషన్లు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

మెదక్ మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల పదవుల కోసం కాంగ్రెస్ పార్టీ తరపున ముగ్గురు అభ్యర్థులు శనివారం నామినేషన్ దాఖలు చేశారు. రాగి వనజ అశోక్, కొరివి రాములు, తాహెర్ అలీ తమ నామినేషన్ పత్రాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కానుగు రాధిక భూపతిరాజ్, వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మాజీ చైర్మన్ చంద్రపాల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, కౌన్సిలర్ మన్సూర్, నాయకులు బొజ్జ పవన్, భూపతిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# భూగర్భ ఆస్తుల రక్షణకు చర్యలు

- కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

భూగర్భ ఆస్తులకు నష్టం కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో విద్యుత్, నీటిపారుదల, టెలికాం, టీఫైబర్, గ్రామపంచాయతీ, ఆర్ అండ్ బీ, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, అటవీ, ఇంట్రా గ్రిడ్ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూగర్భ సదుపాయాల పరిరక్షణ కోసం భారత ప్రభుత్వం రూపొందించిన యాప్‌ను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. తవ్వకాల సమయంలో భూగర్భ లైన్లు దెబ్బతినకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తవ్వకం చేపట్టే ముందు సంబంధిత సమాచారం యాప్‌లో నమోదు చేయడం ద్వారా, ఆ ప్రాంతంలో ఉన్న భూగర్భ సదుపాయాల వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు. ఫైబర్ కేబుల్స్, గ్యాస్ పైపులు, నీటి లైన్లు వంటి భూగర్భ వనరుల వివరాలను ముందుగానే తెలుసుకోవడం వల్ల నష్టం నివారించవచ్చని అన్నారు. భూగర్భ ఆస్తులకు నష్టం కలగకుండా తవ్వకాలు నిర్వహించడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డీపీఓ యాదయ్య, జిల్లా అటవీ అధికారి జోజీ, ఈడీఎం సందీప్, టీఫైబర్ మేనేజర్ ఈశ్వర్, డీఈ అవినాష్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రామ్, మిషన్ భగీరథ అధికారి సంపత్, గ్రిడ్ అధికారి నాగభూషణం, ఈఈ పీఆర్ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## జల్సాలకు అలవాటుపడి వరుస దొంగతనాలు

- నిందితుడు అరెస్ట్..
- రూ.1.80 లక్షల నగదు, బంగారం రికవరీ




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

జల్సాలకు అలవాటు పడి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి వద్ద నుంచి బంగారు, వెండి నగలతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నట్లు మెదక్ టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపారు. ఈ మేరకు మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హవేలీ ఘనపూర్ మండలం తొగిట గ్రామానికి చెందిన మాచబోయిన మహేష్ కుమార్ అనే యువకుడు జల్సాలకు, అమ్మాయిలతో సరదాలకు అలవాటు పడి, డబ్బుల కోసం తాళం వేసి ఉన్న ఇళ్లు, ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడుతూ తరచూ జైలుకు వెళ్తున్నాడని తెలిపారు. డబ్బు అవసరమైన సమయంలో ముందుగానే ఆయా ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతుండగా, శనివారం మెదక్ పట్టణంలోని జేఎన్ రోడ్డులో అతడిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిందితుడి వద్ద నుంచి రూ.1.80 లక్షల విలువైన బంగారు నగలతో పాటు ఆలయాల్లో చోరీ చేసిన రూ.25,348 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే మహేష్ కుమార్‌పై ఒక మర్డర్ కేసుతో పాటు మరో తొమ్మిది కేసులు నమోదై ఉన్నట్లు చెప్పారు. దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని పట్టుకోవడంలో మెదక్ టౌన్ పోలీసులు, సీసీఎస్ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించారని అభినందించారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. దొంగతనాలకు పాల్పడిన మహేష్ కుమార్ ఈ నెల 11వ తేదీన జైలు నుంచి విడుదలై, 12వ తేదీన మిలటరీ కాలనీలోని హనుమాన్ దేవాలయంలో దొంగతనం చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మహేష్ వివరించారు.

# రోడ్డు భద్రతా చైతన్య రథం ప్రారంభించిన ఎస్పీ




**ముద్ర ప్రతినిధి, మెదక్:**

'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతా చైతన్య రథాన్ని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ చైతన్య రథం జిల్లాలోని అన్ని మండలాల్లో పర్యటిస్తూ గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించనుందని తెలిపారు. జనసంచారం అధికంగా ఉండే జంక్షన్‌లు, బస్‌స్టాండ్లు, మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, జీబ్రా క్రాసింగ్ వద్ద రోడ్డు దాటడం, వాహనాల మధ్య సురక్షిత దూరం పాటించడం, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం వంటి అంశాలపై ప్రజలకు వివరణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఏఆర్ డీఎస్పీ రంగనాథ్, సీఐలు మహేష్, జార్జ్, సందీప్ రెడ్డి, కృష్ణమూర్తి, ఆర్ఐలు శైలేందర్, రామకృష్ణ, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

### షార్ట్ ఫిల్మ్ ప్రారంభం

'ఇంటికి చేరాలి' అనే షార్ట్ ఫిల్మ్‌ను ఎస్పీ శ్రీనివాసరావు ప్రారంభించారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, యువతలో రహదారి భద్రతపై సరైన అవగాహన కల్పించడం లక్ష్యంగా మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 99 రోజుల కార్యక్రమం 'సురక్షిత ప్రయాణం'లో భాగంగా 'ప్రాజెక్ట్ ఏబీసీ 3.0' కింద ఈ చిత్రాన్ని రూపొందించారు. కలెక్టర్, జిల్లా ఎస్పీ ప్రజలకు, ముఖ్యంగా యువతకు స్పష్టమైన సందేశాన్ని అందించారు. హెల్మెట్ ధరించడం ఒక ఎంపిక కాదు, అది ప్రాణ రక్షణకు అవసరమని తెలిపారు.




# వంట గ్యాస్ అక్రమ నిల్వలపై కొరడా

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

నర్సాపూర్ పట్టణంలో గ్యాస్ ఏజెన్సీపై రాష్ట్ర విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లైస్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్యాస్ ఏజెన్సీ ద్వారా ప్రజలకు సరఫరా చేయాల్సిన గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను గోదాం నుంచి సరఫరా చేయకుండా, ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచి అనధికారికంగా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇది నిబంధనలకు విరుద్ధంగా అక్రమ చర్యగా పరిగణలోకి తీసుకున్నామని డీసీఎస్ఓ నిత్యానంద్ తెలిపారు. ఈ వ్యవహారంపై సివిల్ సప్లైస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంబంధిత సాహితీ గ్యాస్ ఏజెన్సీపై కేసు నమోదు చేశారు. అక్రమ నిల్వలు, అనధికారిక విక్రయాలు మరెక్కడైనా జరగకుండా నిరంతర పర్యవేక్షణ చేపడతామని తెలిపారు. ఎవరైనా గ్యాస్ సిలిండర్లను ఇళ్లలో నిల్వ ఉంచి అక్రమంగా విక్రయించినట్లయితే తప్పనిసరిగా కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
19.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



## మద్యం బంద్ : తాగుడు వాతావరణం దూరంగా ఉంచండి

- బార్లు, పార్టీలు కొంతకాలం దూరంగా ఉండండి
- తాగేవాళ్లతో ఎక్కువగా గడపకుండా చూసుకోండి





# ఎయిర్‌పోర్ట్ ల పనులు వేగవంతం చేయండి

- మంత్రి పొంగులేటి సూచన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో ఎయిర్‌పోర్ట్‌ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం సచివాలయంలోని తన కార్యాలయంలో ఎయిర్‌పోర్ట్ అధారిటీ సదరన్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజ్ కిషోర్, ఏవియేషన్ డైరెక్టర్ భరత్‌రెడ్డితో కలిసి వరంగల్ , ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో తెలంగాణ ప్రభుత్వం నిర్మించతలపెట్టిన ఎయిర్ పోర్ట్‌లపై సమీక్ష నిర్వహించారు. ఈ ఎయిర్‌పోర్ట్ ల నిర్మాణాలు త్వరగా ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ ఎయిర్ పోర్ట్‌కు ఇప్పటికే సుమారు 953 ఎకరాల భూమిని సేకరించి కేంద్రానికి అప్పగించిందని, వీలైనంత త్వరలో శంకుస్థాపన చేస్తామని వెల్లడించారు. అలాగే ఆదిలాబాద్ విమానాశ్రయాన్ని డిఫెన్స్, సివిల్ ఏవియేషన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాయని, అందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్ తక్షణమే సిద్ధం చేయాలని సూచించారు. ఈ ఎయిర్ పోర్ట్‌కు అవసరమైన భూ సేకరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణలో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గతంలో ప్రతిపాదించిన స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని కేంద్ర పౌర విమానయాన శాఖ తెలిపిన నేపథ్యంలో దీనిపై మరింత లోతైన అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై ఒక నివేదిక రూపొందించాలని సూచించారు.

# మహిళలపై బీజేపీ కపట ప్రేమ

- పారదర్శకం లేని బిల్లులను కాంగ్రెస్ వ్యతిరేకించింది
- మహిళలకు ఏనాడు బీజేపీ ప్రాధాన్యత ఇవ్వలేదు
- బీజేపీ జాతీయ అధ్యక్షురాలుగా మహిళను నియమించారా
- మహిళల అభివృద్ధి పై కాంగ్రెస్ కు చిత్తశుద్ధి ఉంది
- బీజేపీ పచ్చి మనువాద పార్టీ
- రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**



మహిళా, డిలిమిటేషన్ బిల్లులను బీజేపీ రాజ్యాంగానికి విరుద్ధంగా ప్రవేశపెట్టిందని, అందుకే కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందని రోడ్డు రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శనివారం మహబూబ్ నగర్ లోని కాంగ్రెస్ కార్యాలయం లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డితో కలిసి మాట్లాడారు. మహిళలకు వ్యతిరేకంగా ప్రవర్తించే బీజేపీ నాటకాలు తేటతెల్లమయ్యాయని, ఆ పార్టీ ఏనాడు మహిళలకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. బీజేపీ పక్కా మనువాద పార్టీ అని, ఇలాంటి పార్టీతో దేశానికి ప్రమాదం అని అన్నారు. మహిళా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదని లోకసభలో బీజేపీ ప్రవేశపెట్టిన విధానం సక్రమంగా లేదన్నారు. ఎప్పుడైనా మహిళా బిల్లుకు అన్ని రకాల సహకారాన్ని అందించింది కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అన్నారు. కానీ బీజేపీ డీలిమిటేషన్ కు మహిళా బిల్లుకు లింకు పెట్టాలని చూసిందని, దీంతో ఈ బిల్లులకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకించిందన్నారు. కుట్రపూరితంగా మహిళాబిల్లు ను పార్లమెంటులో ప్రవేశ పెట్టి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే ప్రయత్నం చేసిందన్నారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటును బీజేపీ ఎంపీ పాకిస్తాన్ విభజనతో పోల్చడం దుర్మార్గమని, లోక్‌సభ సాక్షిగా ఇలాంటి వ్యాఖ్యలు చేసిన ఎంపీని పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి సూర్య మాట్లాడం చూసి కూడా తెలంగాణ బీజేపీ ఎంపీలు నోరుమెదపక పోవడం చూస్తే సిగ్గేస్తుందన్నారు. ఆనాడు తెలంగాణ ఉద్యమం కోసం కిషన్ రెడ్డిని రాజీనామా చేయమంటే పారిపోయాడని, ఈనాడు ఆయన కేంద్రమంత్రిగా ఉండి, తెలంగాణపై ఎంపీ మాట్లాడిన మాటకు ఎందుకు నోరు మూసుకున్నారని ప్రశ్నించారు. బీజేపీ నాయకులు తెలంగాణ ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షురాలిగా మహిళను నియమించిందని, బీజేపీ జాతీయ అధ్యక్షురాలుగా మహిళకు ఈ రోజు వరకు అవకాశం ఇవ్వలేకపోయిందని విమర్శించారు. ప్రస్తుత డీలిమిటేషన్ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. అంతకుముందు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పంచవటి విద్యాలయ స్కూల్ లో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అర్రైవ్ అలైవ్ ఇన్నగ్రేషన్ కార్యక్రమానికి మంత్రి పొన్నం హాజరయ్యారు. కార్యక్రమంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీ కృష్ణ, కలెక్టర్ ఖుష్బూ గుప్తా , జిల్లా ఎస్పీ జానకీ , మేయర్ మమత, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, జిల్లా మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, అర్రైవ్ అలైవ్ ఇన్నగ్రేషన్ అధికారులు పాల్గొన్నారు.



## ఏపీకి రైల్వే శాఖ
# భారీ ప్రాజెక్టు

- గోదావరి నదిపై రూ.9,889 కోట్లతో మరో వంతెన

**ముద్ర, అమరావతి:**

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర రైల్వేశాఖ ఒక భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. అత్యంత రద్దీగా ఉండే చెన్నై, హౌరా ప్రధాన మార్గంలో భాగంగా నిడదవోలు నుంచి దువ్వాడ వరకు మూడు, నాలుగో రైల్వేలైన్ల నిర్మాణానికి ఆమోదం తెలిపింది. ఈ మెగా ప్రాజెక్టు 198 కిలోమీటర్ల నిర్మాణానికి రూ. 9,889 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. గోదావరి నదిపై 4.3 కిలోమీటర్ల పొడవైన భారీ రైల్వే వంతెనను నిర్మించనున్నారు. 2.67 కిలోమీటర్ల వయాడక్ట్, 3 ప్రధాన బైపాస్ లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. కొత్త అలైన్‌మెంట్ వల్ల ప్రస్తుత మార్గం కంటే సుమారు 8 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

**ఆర్థిక, పర్యావరణ ప్రయోజనాలు**


ఈ ప్రాజెక్టు కేవలం రైల్వేలైన్ మాత్రమే కాదని, ఇది ఒక ఉపాధి కల్పన పొదుపు మార్గం కూడా కేంద్ర రైల్వేశాఖ అభిప్రాయపడింది. ఈ నిర్మాణ పనుల ద్వారా సుమారు 135 లక్షల మానవరోజుల పని లభిస్తుందని అంచనా. రోడ్డు రవాణాతో పోలిస్తే ఏటా సుమారు రూ. 1,150.56 కోట్ల వరకు ఆదా అవుతుంది. డీజిల్ వినియోగం తగ్గడం వల్ల కాలుష్య ప్రభావం గణనీయంగా తగ్గుతుంది. ప్రస్తుతం ఈ మార్గంలో సామర్థ్యం 130 శాతానికి చేరుకోవడంతో రైళ్ల ఆలస్యం సాధారణమైపోయింది. ఈ మూడు, నాలుగో లైన్ల నిర్మాణం పూర్తయితే, ఆంధ్రప్రదేశ్ మీదుగా ప్రయాణించే రైళ్ల వేగం పెరగడమే కాకుండా, పారిశ్రామికంగా ఏపీ అభివృద్ధి చెందనుంది.

# ఘోర రోడ్డు ప్రమాదం – ఇద్దరు యువకులు మృతి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో విషాదకర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జొన్నలబొగూడ బస్ స్టేజ్ సమీపంలోని 167 జాతీయ రహదారిపై మామిడి లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం ఓ బైక్‌ను ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన జరిగింది. ఈ ఘటనలో కుమ్మరి తేజ (20), ఆరేపల్లి ఆంజి (19) అనే ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు తీవ్రంగా గాయపడగా, అతడిని వెంటనే 108 అంబులెన్స్ ద్వారా జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో బైక్ పూర్తిగా దగ్ధమైంది. ఘటన అనంతరం బొలెరో డ్రైవర్ అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. మృతుల కుటుంబ సభ్యుల రోదనలతో సంఘటనా స్థలం మారుమోగింది. సమాచారం అందుకున్న పెద్దకొత్తపల్లి ఎస్సై సతీష్ పోలీసు సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం కొల్లాపూర్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.





# ప్రజాస్వామ్య చరిత్రలో బ్లాక్ డే

- మహిళా బిల్లును అడ్డుకోవటం దారుణం
- బిల్లు అడ్డుకుని జాతికి ద్రోహం చేశారు
- మహిళల్ని ఓటు అడిగే పార్టీలు వారి సాధికారతను ఎలా అడ్డుకుంటాయి
- నిడదవోలులో ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల నిరసన ర్యాలీలో పాల్గొన్న సీఎం చంద్రబాబు

**ముద్ర, నిడదవోలు:**

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును అడ్డుకోవడం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక చీకటి రోజు అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం నిడదవోలులో నిర్వహించిన నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల సాధికారతను అడ్డుకోవడం అంటే సమాజ అభివృద్ధిని అడ్డుకోవడమేనని అన్నారు. రాజకీయ పార్టీలు మహిళల ఓట్లను కోరుతూ, అదే సమయంలో వారి హక్కులను నిరాకరించడం ద్వంద్వ వైఖరి అని విమర్శించారు. మహిళలు దేశ జనాభాలో సగం భాగం కాగా, వారికి చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం అవసరమని స్పష్టం చేశారు.

బిల్లును అడ్డుకున్న ప్రతిపక్షాలు మహిళలకు అన్యాయం చేశాయని అన్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఉద్యమాలు చేపడతామని తెలిపారు. ఈ రోజు చేపట్టిన నిరసన ఆరంభం మాత్రమేనని, దీనిపై పవన్ కల్యాణ్‌తో మాట్లాడి ఎన్డీఏ పక్షాలతో పాటు ఇతర పార్టీలు కూడా కలిసి రావాలని పిలుపునిచ్చారు. 2017లో టీడీపీ అధికారంలో ఉండగా అసెంబ్లీలో తీర్మానం చేసి పంపించామని, కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు బిల్లు కూడా తీసుకు రాలేకపోయారని విమర్శించారు. మహిళల ఆత్మాభిమానం దెబ్బతీసే విధంగా బిల్లును అడ్డుకున్నారని, ఏ ముఖం పెట్టుకుని మహిళల్ని ఆ పార్టీలు ఓట్లు అడుగుతాయి. అని ప్రశ్నించారు. ఆ పార్టీలు చేసిన ద్రోహానికి డిపాజిట్ కూడా రాకుండా చేయాలన్నారు. ఆడబిడ్డలు పైకి వస్తే చూడలేకే ఈ బిల్లును అడ్డుకున్నారన్నారు. ఈ నిరసన ర్యాలీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, జనసేన తరపున మంత్రి కందుల దుర్గేష్, నిమ్మల రామానాయుడు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

# భూదాన్ భూముల సంరక్షణకు ప్రభుత్వం నడుం కట్టాలి

- భూదాన్ ఉద్యమానికి వజ్రోత్సవ వేడుకలు

**ముద్ర, అమరావతి:**

ఔ భూదాన్ భూముల సంరక్షణకు ప్రభుత్వం నడుం కట్టాలని, జాతిపిత మహాత్మా గాంధీ, ఆచార్య వినోబా భావే, జయప్రకాశ్ నారాయణ్ ఆశయాలను కొనసాగించాలని సర్వోదయ మండల్ ఏపీ అధ్యక్షులు రాంబాబు నాయుడు అన్నారు. 75వ "భూదాన్ డే" వేడుకలు ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ ఆధ్వర్యంలో విజయవాడలోని ప్రధాన కార్యాలయములో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1951వ దశకంలో ఉవ్వెత్తున ఎగిసిపడిన ప్రజా ఉద్యమ కెరటం "భూదాన్ యజ్ఞం" అన్నారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది రైతులు "భూదాన్ యజ్ఞానికి" దానం చేసిన "భూదాన్ భూములు" ఇప్పుడు దానవుల చేతుల్లో చిక్కుకుని విలవిలలాడుతున్నాయన్నారు. భూమి లేని నిరుపేదలను భూమి యజమానులుగా చేయాలన్న ఆచార్య వినోబా భావే దృఢ సంకల్పం రెండు తెలుగు రాష్ట్రాలలో ఘోర పరాభవానికి గురవుతున్నదన్నారు. ఈ భూములను సంరక్షించాల్సిన ప్రభుత్వాలు వీటిని ప్రభుత్వ భూములుగా మార్చివేసి కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేస్తున్నాయని విమర్శించారు. ఆచార్య వినోబా కాలంలో పంచబడిన భూదాన్ భూములను క్రమబద్ధీకరించకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో, స్వయంగా ప్రభుత్వాలే వీటిని స్వాహా చేస్తుండడంతో, దీనిని ఆసరాగా చేసుకొని భూబకాసురుల, రియల్ మాయగాళ్లు రెచ్చిపోతున్నారన్నారు. "భూదాన్" లక్ష్యాన్ని, చట్టం యొక్క నిబంధనలను తుంగలో తొక్కుతూ కబ్జా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాలను సంరక్షించాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కూడా ఈ భూములను దొడ్డి దారుల్లో దక్కించుకునేందుకు తెగబడుతున్నారని ఆరోపించారు. తాజాగా తెలంగాణా రాష్ట్రంలో అత్యంత విలువైన భూదాన్ భూములను దొడ్డి దారిలో పలువురు ఉన్నత అధికారులు రిజిస్ట్రేషన్స్ చేయించుకున్నవైనం హైకోర్ట్ జోక్యంతో వెలుగులోకి వచ్చిందన్నారు. ఇంకా వెలుగులోకి రాకుండా ఎన్నో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమములో ఉపాధ్యక్షులు వి. లతా, మహిళా విభాగం కన్వీనర్ దత్త మణి, స్టేట్ సెక్రెటరీస్ ప్రదీప్ దాస్, రాజేంద్ర ప్రసాద్, యూత్ వింగ్ కన్వీనర్ అబ్దుల్ అమీర్ ఖాన్, ఈస్ట్ గోదావరి ప్రెసిడెంట్ పి. వీరబాబు, సర్వోదయ సభ్యులు కోటిబాబు, కిశోరె రాజు, కె. శేషు, ప్రసాద్ రాజు, జ్యోతిర్మయి, సీత మహాలక్ష్మి, పి. రమేష్ పాల్గొన్నారు.




# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు శస్త్ర చికిత్స

ముద్ర, అమరావతి:

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు శనివారం సాయంత్రం శస్త్రచికిత్స జరిగినట్లు రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది నెలలుగా ఆరోగ్యపరంగా ఇబ్బందిపడుతున్న ఆయన శుక్రవారం ఉదయం అధికారులతో పాలనాపరమైన విషయాలపై చర్చిస్తున్న సందర్భంలో తీవ్ర అస్వస్థతకు గురైనట్లు పేర్కొన్నారు. వెంటనే వ్యక్తిగత వైద్యుల సలహాతో శుక్రవారం అధికారిక కార్యక్రమాలను రద్దు చేసుకుని ఆసుపత్రికి వెళ్లి, వైద్య పరీక్షలు, ఎం.ఆర్.ఐ. నిర్వహించారు. వైద్యుల సలహా మేరకు శస్త్ర చికిత్స చేశారు. వారం నుంచి పది రోజులపాటు విశ్రాంతి తర్వాత ఆయన అధికారిక కార్యక్రమాలలో పాల్గొనవచ్చని డాక్టర్లు తెలిపారు. అయితే దీర్ఘకాలం తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని, పూర్తి స్వస్థత చేకూరడానికి ఎక్కువ కాలం పడుతుందని డాక్టర్లు తెలిపినట్లు పేర్కొన్నారు.






# యువతను మోసం చేసిన కాంగ్రెస్

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

**ముద్ర, హైదరాబాద్:**

ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు హామీ ఇచ్చి మోసం చేసిందని వక్తలు ధ్వజమెత్తారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'తెలంగాణలో ఉద్యోగాలు నిరుద్యోగ సమస్య' అనే అంశంపై సీనియర్ జర్నలిస్ట్ ఎ. రమణకుమార్, యార నవీన్ కుమార్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ మొదటి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు, బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి, ప్రభుత్వ రాయితీతో ఏర్పడిన కంపెనీలో 75 శాతం మంది తెలంగాణ యువతకే ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. మొదటి క్యాబినెట్ లోనే మెగా డీఎస్సీ అని హామీలు ఇచ్చారన్నారు. ఈ రెండున్నర సంవత్సర పాలనలో ఏ డిపార్ట్‌మెంట్‌లో ఎన్ని ఖాళీలు ఉన్నాయో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయడం లేదు. ప్రైవేట్ ఉద్యోగాలు భర్తీ కావడం లేదన్నారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యుడు సి. విఠల్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం కావాలంటే కేరళ మోడల్ ఉద్యోగ నియామకాలు జరగాలన్నారు. ప్రైవేట్ సంస్థల్లో కూడా స్థానికులకు ఉద్యోగాలు వచ్చే ప్రభుత్వాలు కఠినమైన జీవో తీసుకురావాలని, అప్పుడు నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయని ఉద్యమకాలంలో ప్రచారం చేశాం. రాష్ట్ర ఏర్పాటు తర్వాత 12 ఏళ్ల తర్వాత ఇంకా నిరుద్యోగం గురించి మాట్లాడుకుంటున్నామని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితికి కారణం రాష్ట్రం కోసం పోరాడిన వ్యక్తులు, పార్టీలు, సంస్థలు మౌనంగా ఉండటమే అన్నారు. రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యోగ సంఘాలు వాళ్ల డిపార్ట్‌మెంట్‌లో ఖాళీల భర్తీ గురించి ప్రశ్నించే పరిస్థితి లేదని, 2014 లో లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, ఇప్పుడు 2 లక్షల ఉద్యోగాలు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్ హయాంలో లక్షా అరవై వేల ఉద్యోగాలు భర్తీ చేసినా, ఈ పన్నెండేళ్ల కాలంలో రిటైర్మెంట్ వల్ల ఏర్పడిన ఖాళీలతో ఆ సంఖ్య 2 లక్షలకు చేరిందన్నారు. తెలంగాణ పునర్ నిర్మాణం కోసం జర్నలిస్టుల ఆధ్వర్యంలోనే అన్ని వేదికలను ఐక్యం చేసే కృషి జరగాలని అన్నారు. రెండు లక్షల ఖాళీలతో పాలన ఎలా సమర్థవంతగా నడుస్తుందని ప్రశ్నించారు. బ్యూరోక్రాట్స్ మాత్రమే ప్రభుత్వాలను నడుపుతున్నారని అందువల్లే ఇలాంటి సమస్యలు వస్తున్నాయని వాపోయారు. ఆందోల్ మాజీ శాసనసభ్యులు క్రాంతి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య ఇప్పటిది కాదని, శాశ్వత పరిష్కారం కావాలంటే ఐక్యంగా ముందుకు రావాలన్నారు. దీని కోసం నిరుద్యోగల జేఏసీ ఏర్పాటు చేయాలని, దీర్ఘకాలికంగా పోరాడితే సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్ర గ్రంథాల పరిషత్ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్, ఆర్థిక విశ్లేషకులు డి. పాపారావు, పోటీ పరీక్షల నిపుణుడు అశోక్ మాజీ వీసీ ప్రొఫెసర్ సీతారామరావు, జర్నలిస్ట్ నాయకులు మారుతీ సాగర్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు నవీన్, నర్ర విజయ్, ఆసరి రాజు, నిరుద్యోగ జేఏసీ నాయకులు భూక్యా కుమార్, సింధూరెడ్డి, ప్రత్యూష, కొడంగల్ రవికుమార్ డీవైఎఫ్‌వై నాయకులు వెంకటేష్, పీవైఎల్ నాయకులు బీఎస్ కృష్ణ, బీఆర్ఎస్‌వీ నాయకులు తుంగబాలు, ఐఐటీ స్కాలర్ రమావత్ మోహన్, ఇజాజ్ ,హరీశ్, పీడీఎస్‌యూ విద్యార్థి నేత మహేశ్ పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 19-04-2026
www.mudranews.in | @mudranews



మద్యం బంద్
మీ ఆరోగ్యాన్ని గుర్తు చేసుకోండి
- మద్యం వల్ల శరీరానికి, మనసుకు వచ్చే నష్టాలు తెలుసుకోండి.
– ఆరోగ్యకరమైన జీవితం లక్ష్యంగా పెట్టుకోండి.

# డీలిమిటేషన్‌పై ప్రత్యామ్నాయ సూచనలు భేష్

- సీఎం రేవంత్ రెడ్డికి ప్రియాంక గాంధీ అభినందనలు
- ప్రతిపక్ష ఐక్యతకు మద్దతుగా నిలిచినందుకు ప్రియాంక గాంధీకి సీఎం కృతజ్ఞతలు



ముద్ర, న్యూ ఢిల్లీ: నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలకు సంబంధించి బీజేపీ విధానంలో లోపాలను ప్రజల ముందుంచడంతో పాటు ప్రత్యామ్నాయ సూచనలు చేసి దక్షిణాది రాష్ట్రాల ఐక్యతకు కృషి చేసినందుకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సీఎం రేవంత్ రెడ్డిని అభినందించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న రేవంత్ రెడ్డి శనివారం అక్కడ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీని కలిశారు. ఈ సందర్భంగా దక్షిణ భారత దేశంతో పాటు ఈశాన్య రాష్ట్రాలు, చిన్న రాష్ట్రాలను బలహీనపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రజాస్వామ్య విరుద్ధ రాజ్యాంగ సవరణను అడ్డుకోవడం.. దేశ భవిష్యత్తును కాపాడేందుకు ప్రతిపక్ష శక్తులను ఏకతాటిపైకి తీసుకురావడంలో విపక్ష నేత రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు మద్దతుగా నిలిచినందుకు తెలంగాణ ప్రజల తరఫున ప్రియాంక గాంధీకి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

# దేశంలోనే అత్యంత పెట్టుబడి కేంద్రంగా హైదరాబాద్

- టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రాపర్టీ ఎక్స్‌పోలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



ముద్ర, తెలంగాణ బ్యూరో: హైదరాబాద్ దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి కేంద్రంగా మారిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. కాంగ్రెస్ పాలన అభివృద్ధి దిశగా స్పష్టమైన దృష్టితో ముందుకు సాగుతూ, మౌలిక సదుపాయాల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ.40వేల కోట్లకు పైగా కేటాయించామని తెలిపారు. రోడ్స్ అండ్ బిల్డింగ్స్ శాఖ ద్వారా సుమారు రూ.70వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు అమలులో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. శనివారం హైదరాబాద్ హైటెక్స్ లో టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "టైమ్స్ ప్రాపర్టీ ఎక్స్ పో – 2026" 6వ ఎడిషన్ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అక్కడ వివిధ స్టాళ్లను సందర్శించి, ప్రదర్శనలో ఉన్న ప్రాజెక్టుల గురించి బిల్డర్లు, డెవలపర్లను అడిగి తెలుసుకున్నారు. గృహ కొనుగోలుదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడారు. టైమ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రాపర్టీ షోకు విశేష స్పందన కనిపిస్తుందని.. ఇలాంటి ప్రాపర్టీ షోలు విజయవంతం కావాలని కోరుకుంటూ... నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సాయి ధర్మ (డైరెక్టర్, టైమ్స్ ఆఫ్ ఇండియా), మనోజ్ యాదవ్ (టీఓఐ బ్రాంచ్ హెడ్), వెంకట్ రావు (అపర్ణ కన్‌స్ట్రక్షన్, మార్కెటింగ్ హెడ్), నవీన్ రెడ్డి (మై హోమ్, మార్కెటింగ్ హెడ్), అశోక్ కుమార్ (శ్రేయాస్ లైఫ్ సైన్సెస్), వరప్రసాద్ (ఫెయిర్‌మౌంట్ కన్‌స్ట్రక్షన్స్ హెడ్), మీరా రవీందర్ (బ్రిక్స్ ఇన్‌ఫ్రా, ఎమ్‌డీ) ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ

- కొత్త రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం
- కేంద్ర కేబినెట్ నిర్ణయాలు

ముద్ర, ఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్రం శుభవార్త చెప్పింది. డీఏను 2 శాతం పెంచుతూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. రైల్వే ప్రాజెక్టులకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏటా రెండుసార్లు కేంద్ర ప్రభుత్వం డీఏను సవరిస్తుంది. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ భత్యాన్ని అందజేస్తారు. ఏటా జనవరి, జులైలో ఈ సవరింపు ఉంటుంది. అయితే ఈసారి డీఏ పెంపు ప్రకటన ఆలస్యమైంది.

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శనివారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 2 శాతం డీఏ పెంచింది. అలాగే సావరిన్ మారిటైమ్ ఫండ్ ఏర్పాటుకు కూడా ఆమోదం లభించింది. దీనికోసం రూ.12,980 కోట్ల నిధులతో ఫండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికింద భారత జెండా నౌకలు, భారత్ నుంచి రాకపోకలు సాగించే నౌకలకు బీమా కవరేజీ అందించడమే లక్ష్యం. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో హర్మూజ్ జలసంధిలో రవాణా నౌకలపై దాడులు జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ నిధిని ఏర్పాటుచేయడం గమనార్హం. గ్రామీణ సడక్ యోజన పథకాన్ని మరో మూడేళ్లపాటు పొడిగించింది.

## రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

దేశవ్యాప్తంగా కొత్త రైల్వే ప్రాజెక్టులు, విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. గాజియాబాద్–సీతాపూర్ మధ్య మూడు, నాలుగో రైల్వే లైన్ల ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. రాజమండ్రి–విశాఖ మధ్య 198 కి.మీ మేర రూ.9,889 కోట్లతో మరో రెండు రైల్వే లైన్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నిడదవోలు–దువ్వాడను కలుపుతూ రైల్వే లైన్లు నిర్మించాలని నిర్ణయించింది. రద్దీ ఎక్కువగా ఉన్న చెన్నై–హౌడా మధ్య ఈ సెక్షన్‌లో నాలుగు లైన్లు తీసుకురావాలని నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు ఏపీలోని తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలను కవర్ చేస్తారు. తూర్పు తీరంలోని విశాఖపట్నం, గంగవరం, మచిలీపట్నం, కాకినాడ పోర్టులకు అనుసంధానం పెరుగుతుంది. ఈ ప్రాజెక్టు మార్గం తూర్పు తీరంలోని అత్యంత రద్దీగా ఉండే, సరకు రవాణా అధికంగా జరిగే మార్గాల్లో ఒకటిగా ఉందని కేంద్రం వెల్లడించింది. ప్రాజెక్టులో భాగంగా గోదావరి నదిపై 4.3 కి.మీ. రైలు వంతెన, 2.67కి.మీ వయాడక్ట్, 3 బైపాస్‌ల నిర్మాణం జరగనుంది.

# రేపటి నుంచి సంక్షేమ వారోత్సవాలు

- రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి
- జిల్లా కలెక్టర్లకు సీఎస్ కీలక ఆదేశాలు



ముద్ర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 20 నుంచి 26 వరకు సంక్షేమ వారోత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కీలక ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడం, ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం అని స్పష్టం చేశారు. కార్యక్రమాల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ ఆదేశించారు. ప్రతిరోజూ జరిగిన పనులపై ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. ఈ సమావేశంలో డీజీపీ బి. శివధర్ రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, సీఐపీఆర్ ఛాందసి ప్రియాంక, అధికారులు పాల్గొన్నారు.

## రోజువారీ కార్యక్రమాల షెడ్యూల్:

**ఏప్రిల్ 20 (శుభ్రత):** అన్ని సంక్షేమ విద్యా సంస్థల్లో కిచెన్, పరిసరాలను శుభ్రపరిచే 'క్లీన్‌లీనెస్ డ్రైవ్'. అధికారులు స్వయంగా సందర్శించి పరిశుభ్రతను పర్యవేక్షించాలి.

**ఏప్రిల్ 21 (టాలెంట్ ఫెస్ట్):** విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు క్విజ్, డిబేట్, డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించడం.

**ఏప్రిల్ 22 (మౌలిక సదుపాయాలు):** హాస్టళ్లు, గురుకులాల్లో అవసరమైన చిన్న చిన్న మరమ్మతులను గుర్తించి, వేసవి సెలవుల్లో వాటిని పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయడం.

**ఏప్రిల్ 23 (తల్లిదండ్రుల సమావేశం):** పేరెంట్–టీచర్ మీటింగ్ నిర్వహించడం, ప్రతిభావంతులైన విద్యార్థులను సన్మానించడం.

**ఏప్రిల్ 24 (నైపుణ్యాభివృద్ధి):** యువతకు ఉపాధి అవకాశాలను పెంచేలా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం.

**ఏప్రిల్ 25 (సమ్మర్ క్యాంపులు):** విద్యార్థుల కోసం క్రీడలు, కళలు, సంగీతం, డిజిటల్ అక్షరాస్యతతో కూడిన వేసవి శిబిరాలు.

**ఏప్రిల్ 26 (బడి బాట):** రాష్ట్రవ్యాప్తంగా అన్ని హాస్టళ్లు, గురుకులాల్లో 'బడి బాట' కార్యక్రమం నిర్వహించడం.

# బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పండి..

- ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి సీఎం రేవంత్ రెడ్డి వినతి



ముద్ర, న్యూ ఢిల్లీ: బయ్యారంలో గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రీన్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఉక్కు కొరత తగ్గడంతో పాటు పర్యావరణానికి మేలు కలుగుతుందని తెలిపారు. ఢిల్లీలో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం ఉదయం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రైజింగ్–2047 విజన్‌లో భాగంగా రూపొందించిన పారిశ్రామిక ప్రతిపాదనలను సీఎం కేంద్ర మంత్రులకు వివరించారు తెలంగాణలో పాత వాహనాల స్క్రాప్‌తో ఉక్కును రీసైక్లింగ్ చేసే పరిశ్రమ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులను సీఎం కోరారు. అందుబాటులో ఉన్న సాంకేతికత, భారీ పరిశ్రమలు, పారిశ్రామిక ఉత్పత్తికి ఉన్న అనుకూలతలతో దేశ పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యాలకు హైదరాబద్ కేంద్రంగా నిలవగలదని కేంద్ర మంత్రులకు సీఎం వివరించారు. హైదరాబాద్‌లో హైడ్రోజన్ టెక్నాలజీతో గ్రీన్ స్టీల్ క్లస్టర్, ఆటో, రక్షణ రంగాలకు అవసరమైన ఉత్పత్తుల తయారీ పరిశ్రమలు, ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో ఈవీ బ్యాటరీల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులు కుమారస్వామి, శ్రీనివాస వర్మలను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. అలాగే మెషిన్ టూల్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక పరికరాల తయారీకి ప్రత్యేక పార్క్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రులకు సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌ను 2034 నాటికి కాలుష్యం లేని నగరంగా మార్చే లక్ష్యంతో వాహనాలను ఈవీలుగా మార్చేందుకు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

## షిండే, నితీష్‌లకు పట్టిన గతే చంద్రబాబుకు పడుతుంది

ముద్ర, తెలంగాణ బ్యూరో: ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలు మనుగడ సాధించలేవని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీ సీఎం చంద్ర బాబు, బీజేపీ కూటమిలో కొనసాగుతున్నారని తెలిపిన రేవంత్ రెడ్డి.. ఏక్‌నాథ్ షిండే, నితీష్ కుమార్‌లకు ఎలాంటి పరిస్థితి వచ్చిందో.. భవిష్యత్‌లో చంద్రబాబుకు కూడా అదే పరిస్థితి వస్తుందని జోస్యం చెప్పారు. బీజేపీకి బలం పెరిగితే టీడీపీని పక్కన పెడతారని సీఎం రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి పలు అంశాలపై మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ తీసుకొచ్చిన మహిళా రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంటులో వీగిపోయిన సందర్భంగా.. సీఎం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అయినా.. బీజేపీతో పొత్తు పెట్టుకున్న పార్టీలకు మనుగడ ఉండదని వ్యాఖ్యానించారు. గతంలో బీజేపీతో పొత్తు పెట్టుకున్న షిండే శివసేన, ఆర్జేడీ పార్టీల పరిస్థితిపై ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. పార్లమెంటులో 2/3 మెజార్టీ వచ్చినంత మాత్రాన వారు అనుకున్న అన్ని చట్టాలు చేయలేరని మోదీ సర్కార్‌ను ఉద్దేశించి అన్నారు. 2/3 మెజారిటీ ఉందని ప్రధానమంత్రిగా ఉన్న వ్యక్తి తానే ఒక రాజును అని చట్టం చేస్తే కుదురుతుందా అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్ష పార్టీకి కేవలం 11 సీట్లే ఉన్నాయని పేర్కొన్న రేవంత్ రెడ్డి.. తానే రాజును అని చంద్రబాబు చట్టం తెస్తే ప్రతిపక్షాలు ఒప్పుకుంటాయా అని నిలదీశారు. నియంత పోకడలను ఎవరూ అంగీకరించరని తేల్చి చెప్పారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు.



## వేసవి వెంటనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు

- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ముద్ర, తెలంగాణ బ్యూరో: వేసవి కాలం ముగిసిన వెంటనే జూన్ లేదా జులై మొదటి వారంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ తిరుగులేని బావుటా ఎగురవేస్తుందని జోస్యం చెప్పారు. శనివారం హైదరాబాద్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణలో పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు ఉండబోతున్నాయని జరుగుతున్న ప్రచారంపై ఆయన స్పందించారు. ఏ శాఖ ఎవరికి శాశ్వతం కాదని అన్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీ సైతం త్వరలోనే ఉండబోతుందని తెలిపారు. రాష్ట్రంలో త్వరలోనే భూముల విలువ పెరగనుందని మంత్రి వెల్లడించారు. ధరణి సమస్యలు భూ–భారతితో పరిష్కారం అవుతాయని చెప్పారు. భూముల రిజిస్ట్రేషన్ మ్యాప్‌తో ఈ నెల 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. మ్యాప్‌తో కూడిన ఫస్ట్ రిజిస్ట్రేషన్ పాలేరులో జరుగుతుందని, రెవెన్యూలో కొత్త పాలసీ తీసుకురాబోతున్నామని ఇందుకు సంబంధించి కసరత్తు జరుగుతుందని అన్నారు.

### త్వరలోనే బీఆర్ఎస్ బాగోతం బయటకు..

అసెంబ్లీలో నాపై ప్రతిపక్షం దాడి చేసినప్పుడు మంత్రులు మద్దతుగా నిలిచారని మంత్రి పొంగులేటి అన్నారు. ప్రతిపక్షం ట్రాప్‌లో తాను పడనని చెప్పారు. అందుకే ఎంత విమర్శించినా ఓపికగా ఉండి సమాధానం చెప్పానన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అక్రమ పనుల జాబితా తయారవుతోందని సరైన సమయంలో అన్నీ బయటకు వస్తాయని హెచ్చరించారు.

# జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో పుంజుకుంటాం



- మాజీ మంత్రి హరీశ్ రావు

ముద్ర, జగిత్యాల: రాజకీయ విలువలున్న సీనియర్ నేత జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ కు మరింత బలం చేకూరుతుందని మాజీ మంత్రి హరీశ్ రావు అభిప్రాయపడ్డారు. జీవన్ రెడ్డి ఈ నెల 20న కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని వెల్లడించారు. శనివారం జగిత్యాలలో పర్యటించిన ఆయన జీవన్ రెడ్డితో భేటీ అయ్యారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు ఒక స్పష్టమైన క్లారిటీ వచ్చేసిందని, 'రేవంత్ రెడ్డి పోవాలి, కేసీఆర్ రావాలి' అని ప్రజలు బలంగా కోరుకుంటున్నారనడానికి జీవన్ రెడ్డి చేరిక సజీవ సాక్ష్యం అన్నారు. ఇటీవల లోక్ సభలో జరిగిన రెండు పరిణామాలు తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా కలచివేశాయని హరీశ్ రావు అన్నారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య తెలంగాణ ఏర్పాటును ఇండియా పాకిస్తాన్ విభజనతో పోల్చడం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీయడమేనన్నారు. ఆ వ్యాఖ్యల పట్ల బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సింది పోయి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెనుకేసుకొచ్చే ప్రయత్నం చేయడం అత్యంత దుర్మార్గం అని మండిపడ్డారు. డా.అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, లోక్‌సభ, రాజ్యసభలో బిల్లులు పాసై, రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ప్రజాస్వామిక పద్ధతిలో తెలంగాణ ఏర్పడిందని గుర్తు చేశారు. బీజేపీ తక్షణమే తేజస్వి వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేదంటే తెలంగాణ మనోభావాలను దెబ్బతీసిన పార్టీగా బీజేపీ మిగిలిపోతుందని అన్నారు. నిన్నటి లోక్‌సభ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎంపీలు లేని లోటు స్పష్టంగా కనిపించిందని, రాష్ట్రం నుంచి 8 మంది కాంగ్రెస్, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా మౌనంగా కూర్చున్నారని మండిపడ్డారు. అదే రాజ్యసభలో ఉన్న ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలు మాత్రం ప్రాజెక్టులపై అవాకులు చవాకులు పేలిన కేంద్ర జల వనరుల మంత్రికి దీటైన సమాధానం ఇచ్చారని అన్నారు.

రేవంత్ రెడ్డి, బీజేపీ మధ్య ఉన్న బడే భాయ్ ఛోటే భాయ్ బంధం మరోసారి బట్టబయలైందని చెప్పారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకుల ఇళ్లను ముట్టడించాలని బీజేపీ పిలుపునిస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం ఢిల్లీలో బీజేపీ కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ ఇంటికి భోజనానికి వెళ్లారని విమర్శించారు. కార్యకర్తలేమో కొట్లాడుకోవాలి.. మీరేమో విందులు చేసుకోవాలా? అని నిలదీసారు.

### హైబ్రిడ్ విధానం ఏంటో స్పష్టమైంది..

డీలిమిటేషన్‌పై రేవంత్ రెడ్డి ప్రతిపాదించిన హైబ్రిడ్ విధానం ఏంటో నేడు స్పష్టమైందని హరీశ్ రావు విమర్శించారు. అది హైబ్రిడ్ కాదు క్రాస్ బ్రీడ్ అని సెటైర్లు వేశారు. ఈ క్రాస్ బ్రీడ్ సిద్ధాంతం రాహుల్ గాంధీకి, సోనియా గాంధీకి అర్థమవుతుందో లేదో అని ఎద్దేవా చేశారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, కాంగ్రెస్ పార్లమెంటులో కొట్లాడినట్లు నాటకాలు ఆడుతూ మహిళలకు తీరని ద్రోహం చేశాయన్నారు. మహిళా బిల్లుకు నిజంగా చట్టబద్ధత కల్పించాలనుకుంటే దాన్ని డీలిమిటేషన్ ప్రక్రియతో ఎందుకు ముడి పెట్టారని ప్రశ్నించారు. మొదటి తెలంగాణ శాసనసభలోనే మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన ఘనత మా పార్టీదేనన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
19.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



మద్యం బంద్ : అవసరమైతే ప్రొఫెషనల్ హెల్ప్ తీసుకోండి




మద్యం బంద్ : అవసరమైతే ప్రొఫెషనల్ హెల్ప్ తీసుకోండి
– కౌన్సిలర్ లేదా డాక్టర్‌ను సంప్రదించండి
– అవసరమైతే డీ-అడిక్షన్ ప్రోగ్రామ్స్‌లో చేరండి

# ఉప్పల్ ఊగిపోయింది..

ముద్ర స్పోర్ట్స్ డెస్క్:
ఐపీఎల్ 2026లో భాగంగా ఇవాళ సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మహేంద్ర సింగ్ ధోనీ ఆడలేదు. సన్‌రైజర్స్‌తో జరిగే పోరులో మహీ ఆడే అవకాశముండటంతో ఈ మ్యాచ్‌కు మరింత క్రేజ్ పెరిగింది. ఈ మ్యాచ్‌కు సంబంధించిన టికెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి. ఆరెంజ్ ఆర్మీకి మద్దతు తెలపడానికి అభిమానులు పెద్ద ఎత్తున ఉప్పల్ స్టేడియం వద్దకు చేరుకున్నారు. సీఎస్కే అభిమానులు కూడా సందడి చేశారు.














## కోహ్లీ లైక్‌పై స్పందించిన జర్మనీ మోడల్

విరాట్ కోహ్లీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పడిన ఒక లైక్‌తో జర్మనీ మోడల్ లిజ్లాజ్ ఒక్క రోజులో పాపులర్ అయింది. ఈ ఘటనపై నెటిజన్లు కోహ్లీని ట్రోల్ చేస్తున్న నేపథ్యంలో లిజ్లాజ్ స్పందించింది. కోహ్లీపై విమర్శలు రావడం తనకు బాధగా అనిపించిందని తెలిపింది.
''ముందు విరాట్ కోహ్లీ నా ఫొటోను లైక్ చేసినప్పుడు చాలా సంతోషంగా అనిపించింది. తర్వాత ఆ పోస్ట్‌ను ఆయన అన్‌లైక్ చేశారు. అనుకోకుండా నేను పాపులర్ అయినందుకు ఆనందమే కానీ, తర్వాత బాధగా అనిపించింది. ఈ ఒక్క లైక్ సోషల్ మీడియాలో ఇంత పెద్ద అంశంగా మారుతుందని ఊహించలేదు. కోహ్లీని ఇంతగా ట్రోల్ చేస్తారని అనుకోలేదు. ఆ లైక్ వెనుక ఆయనకు ఎలాంటి దురుద్దేశం లేకపోయినా నెటిజన్లు తప్పుగా అర్థం చేసుకున్నారు. ఏదేమైనా నా ఫొటోను స్టార్ క్రికెటర్ లైక్ చేసినందుకు గర్వంగా అనిపించింది'' అని లిజ్లాజ్ పేర్కొంది. ఈ జర్మనీ మోడల్‌కు ఐపీఎల్ మ్యాచ్‌లు అంటే చాలా ఇష్టమని తెలిపింది. అందులోనూ ఆర్సీబీకి వీరాభిమాని అని చెప్పింది. తాజాగా లిజ్లాజ్ ఆర్సీబీ జెర్సీ ధరించి పాట పాడుతున్న ఒక వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేసింది. దీంతో నెటిజన్లు 'మీరు తర్వాత జరిగే ఆర్సీబీ మ్యాచ్‌కు వస్తున్నారా' అంటూ కామెంట్లు చేస్తున్నారు. దీనికి స్పందించిన లిజ్లాజ్, 'నాక్కూడా ఆర్సీబీ మ్యాచ్‌ను స్టేడియంలో చూడాలనే ఉంది. కానీ ప్రస్తుతం జర్మనీలో ఉన్నాను' అని తెలిపింది.

# IPL 19, విరాట్ కోహ్లీ 19..


ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :
విరాట్ కోహ్లీ ఏ ముహూర్తంలో టీమిండియాలోకి ప్రవేశించాడో తెలియదు కానీ.. అతడు అడుగుపెడితే అద్భుతం. అతడు బ్యాట్ అందుకొని పరుగులు తీస్తుంటే సమ్మోహనం. వికెట్ల మధ్య చిరుత పులి మాదిరిగా పరుగులు తీస్తుంటే అనితర సాధ్యం. అందువల్లే ఈ తరంలో ఏ ఆటగాడు కూడా అందుకోలేని ఘనతలను విరాట్ కోహ్లీ సొంతం చేసుకున్నాడు. తన పేరును రన్ మిషన్ గా మార్చుకున్నాడు. గొప్ప గొప్ప ప్లేయర్లు ఫామ్ లేమి తో ఇబ్బంది పడుతుంటే.. విరాట్ మాత్రం వీరోచితంగా బ్యాటింగ్ చేస్తున్నాడు.
విరాట్ మైదానంలో అడుగుపెట్టి సింగిల్ పరుగు తీసినా సరే అది చరిత్ర అవుతుంది. సెంచరీ కొడితే విధ్వంసం అవుతుంది. అందువల్లే విరాట్ రావాలి, పరుగులు తీయాలని అభిమానులు కోరుకుంటారు. అభిమానుల అంచనాలను కొన్ని సందర్భాల్లో అందుకోలేకపోయినప్పటికీ.. చాలావరకు వాటిని చేరుకొని సరికొత్తగా కనిపిస్తుంటాడు విరాట్ కోహ్లీ.
ప్రస్తుతం ఐపీఎల్ 19 వ సంవత్సరంలోకి అడుగు పెట్టింది. 2008లో ఐపీఎల్ ప్రారంభమైంది. అప్పటినుంచి ఇప్పటిదాకా ఐపీఎల్ దినదినా ప్రవర్తమానంగా ఎదుగుతూనే ఉంది. ఎంతోమంది ఆటగాళ్లకు అవకాశాలు కల్పిస్తూ.. వారికి ఆర్థిక భరోసాతో పాటు.. రకరకాల సౌకర్యాలు అందిస్తోంది. విరాట్ కోహ్లీ ఐపిఎల్ 19వ ఏట అడుగుపెట్టిన నేపథ్యంలో.. ఢిల్లీ జట్టుతో జరిగిన మ్యాచ్లో 19 పరుగులు చేశాడు.. దీంతో అందరూ ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. విరాట్ కోహ్లీ ఐపిఎల్ 19వ ఏట.. 19 పరుగులు చేయడాన్ని దేవుడు ప్రణాళిక అని చెబుతున్నారు.
విరాట్ కోహ్లీ ప్రస్తుతం సూపర్ ఫామ్ లో ఉన్నాడు. ఇప్పటికే లీడింగ్ రన్స్ తో ఆరెంజ్ క్యాప్ హోల్డర్ గా కొనసాగుతున్నాడు. ఐపీఎల్ కెరియర్ ప్రకారంగా చూసుకుంటే 2008 నుంచి 2023 వరకు మొత్తం 29 ఇన్నింగ్స్‌లో 7263 పరుగులు చేశాడు విరాట్ కోహ్లీ. 37.24 యావరేజ్, 130 స్ట్రైక్ రేట్ కొనసాగించాడు. ఇందులో ఏకంగా 234 సిక్సర్లు ఉన్నాయి. సిక్సర్ రేటు 23.9 గా నమోదయింది. 2024 నుంచి ఇప్పటిదాకా విరాట్ కోహ్లీ ఐపీఎల్ లో 35 ఇన్నింగ్స్ లలో 1,626 పరుగులు చేశాడు. 58.07 యావరేజ్ తో, 151 స్ట్రైక్ రేట్ కొనసాగించాడు. ఇందులో 65 సిక్సర్లు ఉన్నాయి. సిక్సర్ రేటు 16.6 గా కొనసాగిస్తున్నాడు విరాట్ కోహ్లీ.
విరాట్ కోహ్లీ 19 పరుగులు చేయడంతో.. ప్రస్తుతం ఢిల్లీ జట్టుతో జరుగుతున్న మ్యాచ్లో బెంగళూరు ఇబ్బంది పడింది. సాల్ట్ హాఫ్ సెంచరీ చేసినప్పటికీ.. మిగతా ప్లేయర్లు విఫలమయ్యారు. దీంతో బెంగళూరు జట్టు భారీ స్కోరు చేయలేకపోయింది. సొంత మైదానంలో 200కు నుంచి పరుగులు చేస్తుందనుకుంటే.. చివరికి 175/8 వద్ద తన ఇన్నింగ్స్ ముగించింది.



## రోహిత్ శర్మను అధిగమించిన స్మృతి మంధాన

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:
దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో జట్టు పరంగా టీమిండియా మహిళల జట్టుకు నిరాశ ఎదురైనా, స్మృతి మంధాన చరిత్ర సృష్టించింది. టీ20 అంతర్జాతీయాల్లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానానికి చేరుకుంది.
ఈ మ్యాచ్‌కు ముందు మంధాన, రోహిత్ శర్మ ఇద్దరూ 4,231 పరుగులతో సమానంగా ఉన్నారు. అయితే మ్యాచ్‌లో మంధాన 13 పరుగులు చేయడంతో మొత్తం పరుగులు 4,244కు చేరి రోహిత్ శర్మను అధిగమించింది. దీంతో భారత్ తరఫున టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా నిలిచింది. తన కెరీర్‌లో మంధాన ఇప్పటివరకు ఒక సెంచరీ, 33 అర్ధశతకాలు నమోదు చేసింది. 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికిన నేపథ్యంలో ఈ రికార్డును తిరిగి అధిగమించే అవకాశం లేకపోవడం గమనార్హం. ఈ ఘనతతో భారత టీ20 క్రికెట్‌లో పరుగుల రాణిగా మంధాన స్థానం మరింత బలపడింది.







## మిల్లర్ మెరుపులతో ఢిల్లీ విజయం

ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:
ఐపీఎల్ 2026లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్-రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 175 పరుగులు చేయగా, ఢిల్లీ 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఢిల్లీ బ్యాటర్లలో కేఎల్ రాహుల్ (57), ట్రిస్టన్ స్టబ్స్ (60 నాటౌట్) కీలక ఇన్నింగ్స్ ఆడారు. చివర్లో డేవిడ్ మిల్లర్ (22 నాటౌట్) దూకుడుగా ఆడి జట్టును విజయతీరాలకు చేర్చాడు. చివరి ఓవర్లో ఢిల్లీకి 15 పరుగులు అవసరం కాగా, మిల్లర్ వరుసగా రెండు సిక్సులు బాది ఉత్కంఠ పెంచాడు. ఐదో బంతికి బౌండరీ సాధించడంతో ఢిల్లీ విజయం ఖరారైంది. ఐదు మ్యాచ్‌ల్లో ఢిల్లీకి ఇది మూడో విజయం కాగా, ఆరు మ్యాచ్‌ల్లో ఆర్సీబీకి రెండో ఓటమి నమోదైంది. తొలుత ఆర్సీబీ బ్యాటర్లలో ఫిల్ సాల్ట్ (63) రాణించాడు. మిగతా బ్యాటర్లలో టిమ్ డేవిడ్ (26), విరాట్ కోహ్లీ (19), పడిక్కల్ (18) స్వల్పంగా రాణించారు. ఢిల్లీ బౌలర్లలో లుంగి ఎంగిడి, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్ రెండేసి వికెట్లు పడగొట్టగా, ముకేశ్ కుమార్ ఒక వికెట్ సాధించాడు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
19.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## గోల్డ్ లుక్‌లో గ్లామర్ షో...
# ప్రగ్యా హాట్ హంగామా!

**ముద్ర, సినిమా డెస్క్ :**
ప్రగ్యా జైస్వాల్ మరోసారి తన గ్లామరతో సోషల్ మీడియాను షేక్ చేసింది. సినిమాల్లో అందంతో ఆకట్టుకునే ఈ బ్యూటీ, ఆఫ్‌స్క్రీన్‌లోనూ అదే స్టైల్‌ను కొనసాగిస్తూ అభిమానులను మెప్పిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

ఈ ఫోటోషూట్‌లో ప్రగ్యా గోల్డ్ కలర్ స్లీవ్‌లెస్ టైట్ డ్రెస్‌లో మెరిసిపోతూ హాట్ హంగామా సృష్టించింది. సింపుల్ యాక్సెసరీస్‌తోనే స్టైలిష్ లుక్‌ను ప్రెజెంట్ చేస్తూ, చిన్న ఈయర్‌రింగ్స్, గోల్డ్ హైహీల్స్‌తో తన అవుట్‌ఫిట్‌ను మరింత హైలైట్ చేసింది. హెయిర్ స్టైలింగ్ కూడా ఆమె లుక్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది.

వివిధ యాంగిల్స్‌లో ఇచ్చిన పోజులు, కాన్ఫిడెంట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో ప్రగ్యా మరోసారి తన గ్లామర్ పవర్‌ను చూపించింది. ఈ ఫోటోలలో ఆమె అందం, స్టైల్ కలిసి అభిమానులను కట్టిపడేస్తున్నాయి.

ప్రస్తుతం ఈ పిక్స్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ, నెటిజన్ల నుంచి భారీ స్పందనను అందుకుంటున్నాయి. గోల్డ్ లుక్‌లో ప్రగ్యా చూపించిన ఈ గ్లామర్ షో, ఆమె ఫ్యాన్స్‌కు మరో విజువల్ ట్రీట్‌గా మారింది.



## తలైవా హవా
# తగ్గలేదే!

**ముద్ర, సినిమా డెస్క్ :**
సౌత్ ఇండియాలో ఒకప్పుడు సూపర్ స్టార్ రజినీకాంత్ పేరు అంటేనే వేరే లెవల్ క్రేజ్. ఆయన సినిమాల బడ్జెట్‌లు, బిజినెస్ డీల్స్, బాక్సాఫీస్ కలెక్షన్లు అన్నీ ప్రత్యేకంగా నిలిచేవి. పారితోషికం విషయంలోనూ ఆయనకు సాటి ఎవరూ లేరని చెప్పేవారు. అయితే కాలక్రమేణా పరిస్థితులు మారి, ప్రభాస్, అల్లు అర్జున్, విజయ్ వంటి స్టార్ హీరోలు మార్కెట్‌లో తమ స్థాయిని పెంచుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కొంతకాలం తగ్గిన రజినీ జోరు, 'జైలర్' సినిమాతో మళ్లీ పీక్‌కి చేరింది. ఆ చిత్రం రూ.500 కోట్లకు పైగా వసూళ్లు సాధించి కోలీవుడ్‌లో కొత్త బెంచ్‌మార్క్‌లు సెట్ చేసింది. ఆ తరువాత వచ్చిన 'కూలీ' సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, వసూళ్ల పరంగా మాత్రం తన రేంజ్ చూపించాడు. ఇప్పుడు రజినీకాంత్ నటిస్తున్న 'జైలర్2'పై భారీ అంచనాలు నెలకొన్నాయి. విడుదలకు ముందే ఈ సినిమా డిజిటల్ మార్కెట్లో సంచలనం సృష్టిస్తోంది. ఓటీటీ హక్కులను అమేజాన్ ప్రైమ్ వీడియో సంస్థ సుమారు రూ.160 కోట్ల భారీ మొత్తానికి సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఇది కోలీవుడ్‌లోనే అత్యంత భారీ డీల్‌లలో ఒకటిగా చెప్పబడుతోంది. ముందుగా 'జైలర్' చిత్రాన్ని అదే సంస్థకు రూ.75 కోట్లకు విక్రయించగా మంచి లాభాలు వచ్చాయి.



## అందంలో సూపర్ హిట్...
# సక్సెస్ మాత్రం యావరేజ్

ముద్ర, సినిమా డెస్క్:
మోడలింగ్ నుంచి వెండితెరకు వచ్చిన దివ్యభారతి తన అందం, స్టైల్‌తో తొలినాళ్లలోనే ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. కానీ తొలి సినిమా తర్వాత రావాల్సిన అవకాశాలు ఆలస్యమవడంతో ఆమె కెరీర్ ఊహించినంత వేగంగా ముందుకు సాగలేదు. దీంతో ఆమె దగ్గర ఉన్న ప్రతిభ పూర్తిగా బయటపడే అవకాశాలు ఇంకా దక్కలేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది.
సినిమాల్లో విరామం కనిపించినప్పటికీ, సోషల్ మీడియాలో మాత్రం ఆమె ప్రభావం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవల రాయల్ బ్లూ గౌన్‌లో చేసిన ఫోటోషూట్‌లో ఆమె అందం మరింత హైలైట్ అయింది. సాదాసీదా లుక్‌లోనూ ఆకట్టుకునే గ్లామర్‌తో అభిమానులను మంత్రముగ్ధులను చేసింది. కెమెరా ముందు ఆమె చూపించే ఆత్మవిశ్వాసం, ప్రెజెన్స్ మాత్రం ఎప్పటికీ తగ్గదని మరోసారి స్పష్టమైంది. అయితే నిజమైన గుర్తింపు మాత్రం ఒక పెద్ద విజయంతోనే వస్తుంది. సరైన కథ, బలమైన పాత్ర దొరికితే దివ్యభారతి బాక్సాఫీస్ వద్ద సత్తా చాటడం కష్టమేమీ కాదని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటివరకు అందంతో ఆకట్టుకున్న ఆమె, కెరీర్‌లో కూడా అదే స్థాయి విజయాన్ని ఎప్పుడు అందుకుంటుందో చూడాల్సి ఉంది.

# మరోసారి సూర్య– జ్ఞానవేల్ కాంబో సిద్ధం



**ముద్ర, సినిమా డెస్క్ :**
దక్షిణాది స్టార్ హీరో సూర్య, దర్శకుడు జ్ఞానవేల్ మరోసారి కలిసి పని చేయనున్నారనే వార్తలు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. గతంలో ఈ కాంబినేషన్‌లో వచ్చిన సినిమా మంచి విజయాన్ని అందుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలు దక్కించుకుంది. దీంతో ఈ జోడీ మళ్లీ కలవబోతుండటంపై ఆసక్తి నెలకొంది. సమాజ సమస్యలను ప్రతిబింబించే కథలను ఎంచుకోవడంలో సూర్య ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈసారి కూడా అలాంటి శక్తివంతమైన కథను జ్ఞానవేల్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కథ నచ్చడంతో సూర్య వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ చిత్రం కూడా సామాజిక అంశాలపై దృష్టి సారించేలా ఉండనుందని టాక్ వినిపిస్తోంది. గతంలో వీరి కలయికలో వచ్చిన చిత్రం అట్టడుగు వర్గాల సమస్యలను హృదయానికి హత్తుకునేలా చూపించి ప్రత్యేక గుర్తింపు పొందింది. అదే తరహాలో ఈసారి కూడా బలమైన సందేశంతో కూడిన కథను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం సూర్య ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. అవి పూర్తయ్యిన తర్వాత ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించే అవకాశం ఉంది. ఇక జ్ఞానవేల్ కూడా తాజాగా చేసిన చిత్రంతో మంచి గుర్తింపు తెచ్చుకుని, ఇప్పుడు సూర్యతో కలిసి మరో ప్రభావవంతమైన కథను తెరపైకి తీసుకురావడానికి సిద్ధమవుతున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోయే సినిమాపై అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు.

## బన్నీలో ఆ గ్రేస్ అంటే
# చాలా ఇష్టం




ముద్ర, సినిమా డెస్క్ :
తెలుగు ప్రేక్షకులకు 'ఉయ్యాలా జంపాల' సినిమాతో దగ్గరైన అవికా గోర్, తన నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. ప్రస్తుతం విభిన్నమైన కథలను ఎంపిక చేసుకుంటూ ముందుకు సాగుతున్న ఈ నటి, తాజాగా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌పై తన అభిమానం వ్యక్తం చేసింది.
ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, బన్నీ డాన్స్ స్టైల్ తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని చెప్పింది. ముఖ్యంగా ఆయనలో కనిపించే గ్రేస్ చాలా ప్రత్యేకమని, అదే తనకు అత్యంత ఇష్టమని పేర్కొంది. "డాన్స్‌లో ఆయన చూపించే ఆ ఫ్లో, ఈజ్ చాలా అద్భుతంగా ఉంటుంది. అలాంటి గ్రేస్ ప్రతి ఒక్కరికి సాధ్యం కాదు" అని ఆమె తెలిపింది. అల్లు అర్జున్ కేవలం డాన్స్‌లోనే కాకుండా, తనను తాను తీర్చిదిద్దుకునే విధానంలోనూ ఎంతో ప్రేరణనిస్తారని అవికా చెప్పింది.
ఆయనలో ఉండే ఎనర్జీ, పాజిటివ్ వైబ్ తనను బాగా ఆకట్టుకుంటాయని పేర్కొంది. సెల్ఫ్ మేడ్ స్టార్‌గా ఎదిగిన బన్నీ ప్రయాణం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని ఆమె అభిప్రాయపడింది. ప్రస్తుతం అవికా చేసిన ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల్లో చర్చకు దారితీస్తున్నాయి.

## రస్ట్ రెడ్ లుక్‌లో అదరగొట్టిన
# ఫౌజీ లేడీ

ముద్ర, సినిమా డెస్క్ :
కన్నడ సినీ ప్రపంచంలో 'సప్త సాగరాలు దాటి సైడ్ బి' చిత్రంతో తన నటనకు మంచి గుర్తింపు తెచ్చుకున్న చైత్ర జే ఆచార్ ఇప్పుడు తన కెరీర్‌లో కీలక మలుపు దిశగా అడుగులు వేస్తోందని టాక్ వినిపిస్తోంది. టాలెంటెడ్ యాక్ట్రెస్‌గా పేరొందిన ఆమె, త్వరలోనే టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతుందనే వార్తలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సూపర్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఫౌజీ'లో చైత్రకు అవకాశం దక్కినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ఆమె కీలక పాత్రలో కనిపించనుందని సమాచారం. ఇదే నిజమైతే, చైత్రకు ఇది తెలుగు తెరపై ఎంతో ఆసక్తికరమైన డెబ్యూ అవుతుంది. 1940ల కాలనీయ భారతదేశం నేపథ్యంగా రూపొందుతున్న 'ఫౌజీ' ఒక పీరియడ్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ సినిమాలో ఇమాన్వి కూడా ముఖ్య పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక చైత్ర ఇటీవల రస్ట్ రెడ్ అవుట్‌ఫిట్‌లో కనిపించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సింపుల్ స్టైల్‌తోనే ఎలిగెంట్ లుక్‌ను ప్రెజెంట్ చేస్తూ ఆమె అందం అభిమానులను ఆకట్టుకుంటోంది.



## అభిమాని మాటలు నాకు
# స్ఫూర్తి ఇచ్చాయి: అడివి శేష్



నటుడు అడివి శేష్ తాను ఎందుకు సినిమాలు చేస్తున్నానన్న విషయాన్ని ఓ అభిమాని గుర్తుచేశాడని తెలిపారు. శనివారం నిర్వహించిన తన కొత్త సినిమా 'డెకాయిట్' థాంక్యూ మీట్‌లో మాట్లాడారు. శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించింది. ఏప్రిల్ 10న విడుదలైన ఈ రొమాంటిక్ యాక్షన్ మూవీ ఇప్పటి వరకు రూ.50 కోట్లకు పైగా వసూళ్లు సాధించడంతో ఈ సందర్భంగా వేడుక నిర్వహించారు. శేష్ మాట్లాడుతూ.. "'డెకాయిట్'కు సంబంధించి బెంగళూరులో ఒక వేడుక నిర్వహించాం. ఆ సమయంలో తమిళనాడు నుంచి వచ్చిన ఓ అభిమాని నాతో మాట్లాడాడు. 'ఇటీవల నాపై కొందరు దాడి చేశారు. చికిత్స కోసం చాలా రోజులు ఆస్పత్రిలోనే ఉన్నా. అక్కడ ఉన్నంతసేపు బయటకు రావాలంటే భయమేసింది. అలాంటి సమయంలో నాకు ధైర్యాన్నిచ్చింది మీ 'మేజర్' సినిమానే. ఆస్పత్రి నుంచి బయటకు వచ్చాక థియేటర్‌కు వెళ్లి 'డెకాయిట్' చూశా' అని చెప్పాడు. నా సినిమాల గురించి మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యాడు. నేను ఎందుకు సినిమాలు చేస్తున్నానన్న విషయాన్ని గుర్తుచేశాడు. ఆ క్షణంలో నేనింకా కష్టపడాలని అనిపించింది" అని తెలిపారు. "సినిమా నచ్చితే ప్రేక్షకులు కొత్త వారిని ప్రోత్సహిస్తున్నారు. నచ్చకపోతే పెద్ద నటుల సినిమాలైనా చూడటం లేదు. మా సినిమాను ఆదరించిన ప్రేక్షకులు, మీడియా, ఇండస్ట్రీకి కృతజ్ఞతలు. ఈ సినిమా గురించి రామ్ చరణ్ పెట్టిన పోస్టు చూసి ఆశ్చర్యపోయా. నాని కూడా ఫోన్ చేసి సినిమా బాగుందని చెప్పారు. నా కెరీర్‌లో మొదటిసారి మ్యూజికల్ హిట్ సాధించా. డ్యాన్స్ చేయగలిగిన పాటలు 'డెకాయిట్'లోనే ఉన్నాయి" అని పేర్కొన్నారు.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com